

నైట్ షెల్టర్లు.. నామమాత్రమే




చలికి వణుకుతూ.. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ.. ఆకలితో అలమటిస్తూ.. రోగాలతో అల్లాడుతూ.. దాడులు, దౌర్జన్యాల భయంతో ఎందరో అభాగ్యులు, అనాథలు, దిక్కులేని వారు ఎందరో రోడ్డు పక్కల ఆశ్రయం పొందుతూ ఉంటారు. పగలు ఏదోలా కాలం గడిపినా రాత్రిళ్లు వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. ఇలాంటి వారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఆశ్రయం కల్పించి ఆదరించాలి. సుప్రీంకోర్టు కూడా గతంలో నిరాశ్రయుల ఆశ్రయం కోసం ప్రతీ మున్సిపల్ కేంద్రంలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని పట్టణాల్లో కొన్ని దగ్గర్ల పేరుకు మాత్రమే నిరాశ్రయుల వసతిగృహాలను ఏర్పాటు చేయగా, కొన్ని దగ్గర్ల అసలు వాటి ఊసే లేదు. మున్సిపాలిటీల్లో కొన్ని దగ్గర్ల మెప్మా ఆధ్వర్యంలో మరికొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల నిర్వహణలో నైట్‌షెల్టర్లు కొనసాగుతున్నా అవి నామమాత్రంగానే ఉంటున్నాయి. దీంతో ఇక్కడ ఆశ్రయం పొందే అభాగ్యుల కంటే రోడ్లపై ఉండేవారే వందల్లో ఉంటున్నారు. వారం రోజులుగా వీస్తున్న చలి గాలులకు ఇబ్బందులు పడుతూ రోడ్లు, ఫుట్‌పాత్‌లపై రాత్రిళ్లు ఎందరో నిద్రిస్తున్నారు.



సౌకర్యాలున్నా వినియోగించుకునే వారు లేక ఖాళీగా ఉన్న రేపల్లెలోని నిరాశ్రయుల వసతి గృహం

- కనీస సదుపాయాలు కరువు
- నిర్వహణకు నిధుల కొరతని నిర్లక్ష్యం
- రోడ్ల పక్కన, డివైడర్లపై నిరాశ్రయుల ఆశ్రయం
- నిద్రకు.. ఆకలికి అలమటిస్తున్న అభాగ్యులెందరో
- చాలాప్రాంతాల్లో మూత.. కొన్నిచోట్ల పేరుకు మాత్రమే ఏర్పాటు
- సుప్రీంకోర్టు తీర్పు ఉన్నా పట్టించుకోని పుర పాలకులు, అధికారులు



వినుకొండ రైల్వే స్టేషన్‌లో..



ఖాళీగా దర్శనమిస్తున్న బాపట్ల రైలుపేటలో నైట్‌షెల్టర్

(ఆంధ్రజ్యోతి - న్యూస్ నెట్‌వర్క్)

గూడు లేని.. ఆదరించే వారు లేని అభాగ్యుల ఆశ్రయం కోసం పట్టణాల్లో నైట్‌షెల్టర్లను ఏర్పాటు చేయాలి. ఇక్కడ ఆశ్రయం కోసం వచ్చే వారికి భోజనం అందించడంతో పాటు రాత్రిళ్లు నిద్రించే సౌకర్యాలు కల్పించాలి. అయితే జిల్లాలోని మున్సిపాల్టీల్లో పేరుకే ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దీంతో పేరుకు నైట్‌షెల్టర్లు ఉన్నా అక్కడ ఆశ్రయం పొందేందుకు అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. సరైన సౌకర్యాలు లేవని, అపరిశుభ్రత తదితర కారణాలతో కొందరు, ఈ తెలియక కొందరు నిరాశ్రయుల వసతిగృహాలకు ఆదరణ తగ్గుతుంది. దీంతో చాలామంది రోడ్ల వెంబడి ఫుట్‌పాత్‌లపైనే చలికి వణుకుతూ కాలం వెళ్లదీస్తున్నారు. నైట్‌షెల్టర్లపై అవగాహన పెంచి వాటి సేవలను నిర్భాగ్యులందరికీ అందేలా చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యాచకులు, ఆదరించేవారు లేని ఒంటరివారు, ఇతర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే వారు దుర్భర పరిస్థితుల మధ్య ఫుట్‌పాత్‌లు, అండర్ పాస్‌ల్లో, పార్కులు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారు. దాతలు ఎవరైనా భోజనం అందిస్తూ తింటూ, వారిచ్చే దుప్పట్లు కప్పుకుని రోడ్లపైనే కాలం గడుపుతుంటారు. ప్రతీ మున్సిపాల్టీలోనూ నైట్ షెల్టర్లు కొనసాగాల్సి ఉన్నా అధికారులు స్వచ్ఛంద సంస్థలకు అప్పగించి పట్టించుకోవడంలేదు. కొన్ని దగ్గర్ల నిధుల కొరతతో మూసేశారు. షెల్టర్ జోన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. దీంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చాలాదగ్గర్ల ఈ వసతిగృహాలు మూతపడ్డాయి. రోడ్లపై ఆశ్రయం పొందేవారు వ్యక్తిగత శుభ్రత లోపించి రోగాల బారిన పడుతున్నారు.

(మిగతా 6వ పేజీలో..)

దాతల ఔదార్యంతో దుప్పట్లు

వర్షాకాలం, చలికాలంలో చలిగాలులకు రోడ్లపై నిద్రించే నిరాశ్రయులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. దోమలతో కంటి మీద కునుకు ఉండదు. రోడ్డు పక్కన చలికి వణుకుతూ కనిపించే వారిని చూసిన వారు మానవత్వంతో స్పందించి ఆహారం, దుప్పట్లు వంటివి అందజేస్తుంటారు. ఇలాంటివారు అందచేసే దుప్పట్లతో చలిగాలులు, దోమల నుంచి రక్షణ పొందుతుంటారు. మళ్లీ కొత్తగా ఎవరైనా దాతలు ఇచ్చే వరకు గతంలో అందజేసిన దుప్పట్లతోనే కాలం వెళ్లదీస్తూ ఉంటారు.

అయ్యో పాపం

గతంలో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పార్కుల్లో నిర్భాగ్యులు రాత్రిళ్లు ఆశ్రయం పొందేవారు. అధికారులు వీరిని రానీయకుండా కట్టడి చేస్తున్నారు. ఎవరైనా పార్కులు, బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంగణాల్లో నిద్రిస్తున్నా పోలీసులు తరుముకుంటున్నారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీరంతా రోడ్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇలా రోడ్లపై ఆశ్రయం పొందే పురుషుల కంటే మహిళలు, బాలికల బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నిరాశ్రయుల్లో వృద్ధులు ఎక్కువగా ఉండడంతో వారి యాతన చెప్పనలివి కాకుండా ఉంది.



చేర్రెడ్డి మంజులారెడ్డి
ఉండవల్లి శ్రీదేవి
సజ్జా హేమలత
చిలకలపూడి పాపారావు

పదవుల పండుగ

- 3 జిల్లాలు.. 9 మందికి పదవులు
- కష్టానికి, త్యాగానికి అధిష్ఠానం గుర్తింపు
- గుంటూరు నుంచి శ్రీదేవి, దేగల, మన్నవ, చిల్లపల్లిలకు చాన్స్
- పల్నాడు జిల్లా నుంచి మంజులారెడ్డి, గోనుగుంట్లకు అవకాశం
- బాపట్ల నుంచి పాపారావు, రాజశేఖర్‌బాబు, హేమలతలకు అందలం

గుంటూరు, బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరిన దగ్గర నుంచి నామినేటెడ్ పదవుల కోసం ఎదురు చూస్తున్న నాయకులు పండుగ చేసు కుంటున్నారు. ఐదు నెలలుగా ఎప్పుడు.. ఎవరికి.. ఎలా పదవులు వస్తాయోనని ఎదురుచూస్తోన్న కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం తీపికబురు చెప్పారు. సెప్టెంబరులో ప్రకటించిన తొలి జాబితాలో కొందరికి అవకాశం దక్కగా మిగిలిన వారు పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చంద్రబాబు పెద్దసంఖ్యలో నామినేటెడ్ పదవులను ప్రకటించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో తొమ్మిది మందికి పదవుల పందేరం జరిగింది. కష్టనష్టాలకోర్చి, త్యాగాలకు వెనుదీయక పార్టీ కోసం పని చేసిన నేతలు, కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం తగిన గౌరవాన్ని కల్పిస్తోంది. తాజా జాబితాలో గుంటూరు జిల్లా నుంచి తాడికొండ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు ఉండవల్లి శ్రీదేవి, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు దేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ, మంగళగిరికి చెందిన జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన టీడీపీ మహిళా నేత మంజులారెడ్డి, నరసరావుపేటకు చెందిన టీడీపీ దివ్యాంగ విభాగం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు, బాపట్ల జిల్లాలో రేపల్లెకి చెందిన జనసేన నేత చిలకలపూడి పాపారావు, బాపట్లకు చెందిన టీడీపీ నేత సలగల రాజశేఖర్‌బాబు, చీరాలకి చెందిన టీడీపీ నాయకురాలు సజ్జా హేమలతలను పదవులు వరించాయి. కాగా సార్వత్రిక ఎన్నికల సమయంలో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల దాడులు, దౌర్జన్యాలకు ఎదురు నిలిచి తీవ్రంగా గాయాలపాలైన మంజులారెడ్డికి చంద్రబాబు ప్రత్యేకంగా గుర్తించారు. గడచిన ఎన్నికల్లో టీడీపీ నుంచి బాపట్ల ఎంపీ సీటు అభ్యర్థిత్వాన్ని ఆశించిన సలగల రాజశేఖర్‌బాబు కొన్ని సమీకరణాల నేపథ్యంలో పార్టీ ఆయనకు సీటు ఇవ్వలేకపోయింది. ప్రస్తుతం ఆయన బాపట్ల జిల్లా టీడీపీ అధ్యక్షులుగా కూడా ఉన్నారు. రెండో జాబితాలో బాపట్ల జిల్లాలో ముగ్గురిని నామినేటెడ్ పోస్టులు వరించగా రెండు టీడీపీ, ఒకటి జనసేన నేతలు దక్కించుకున్నారు. వీరిలో బాపట్లకు చెందిన సీనియర్ టీడీపీ నేత, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సలగల రాజశేఖరబాబును కీలకమైన బాపుడా ఛైర్మన్ పదవి వరించింది. చీరాలలో టీడీపీ గెలుపులో తనవంతు సహకారం అందించిన బీసీ(దేవాంగ) సామాజికవర్గానికి చెందిన సజ్జా హేమలతకు అధిష్ఠానం ప్రాధాన్యం ఇచ్చింది. ఇక రేపల్లెకు చెందిన మత్స్యకార సామాజికవర్గానికి చెందిన చిలకలపూడి పాపారావుకు కూడా పదవి దక్కింది. ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పదవి డాక్టర్ పెదపూడి విజయ్‌ను వరించగా ఈయన ప్రస్తుతం పర్చూరు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా ఉన్నారు. కానీ ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా పరిధిలో ఉండడంతో పార్టీ ప్రకటించిన జాబితాలో ఈ పదవిని ఒంగోలు కోటాలో చూపించారు.

ఇప్పటికే పలువురికి పదవులు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక విడతలో వివిధ కార్పొరేషన్లకు ఛైర్మన్లు, డైరెక్టర్లను ప్రకటించింది. ఆ తర్వాత టీటీడీ పాలక మండలిలో పలువురుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా పరిధిలో పలువురికి పదవులు దక్కాయి. సెప్టెంబరు 24న తొలివిడుత నామినేటెడ్ పదవుల జాబితాలో పిల్లి మాణిక్యరావుకు ఏపీలిడ్‌క్యాప్ ఛైర్మన్ పదవి వరించగా, పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి మంగళగిరికి చెందిన నందం అబద్ధయ్యను వరించింది. అమరావతి ఉద్యమంలో కీలకంగా పనిచేసిన రాయపాటి శైలజతోపాటు మంగళగిరికి చెందిన పార్థసారథి, తెనాలికి చెందిన కోటేశ్వరరావులకు తొలి జాబితాలో స్థానం దక్కింది. ఇటీవల విడుదలైన టీటీడీ పాలక మండలిలో మంగళగిరికి చెందిన తమ్మిశెట్టి జానకీదేవి, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తుళ్లూరుకు చెందిన నన్నపనేని సదాశివరావులను సభ్యులుగా నియమితులయ్యారు.

వీర వనితకు అందలం



రెంటచింతల: గడచి న సార్వత్రిక ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ మూకల అరాచకాలను పురుషులే తట్టుకోలేకపోయారు. అయితే ఓ మహిళ పోలింగ్ రోజున వైసీపీ మూకల గొడ్డలి దాడితో రక్తం కారుతున్నా వైసీపీ అక్రమాలను అడ్డుకుని వీర వనితగా రాష్ట్ర వ్యాప్తంగా వార్తల్లోకెక్కింది. ఆమే రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చేర్రెడ్డి మంజులరెడ్డి. చంద్రబాబు శనివారం ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల జాబితాలో ఏపీ శిల్పారామం ఆర్ట్స్ క్రాఫ్ట్ అండ్ కల్చరల్(హస్తకళాభివృద్ధి) సొసైటీ ఛైర్మన్ పదవి ఆమెను వరించింది. రెంటాల గ్రామంలో మే 13న జరిగిన పోలింగ్ రోజున వైసీపీ మూకల అరాచకాలకు అడ్డుగా నిలిచి వీరోచితంగా పోరాడి బూత్‌లో టీడీపీ తరపున ఏజెంట్‌గా కూర్చొన్నారు. పోలింగ్ బూత్‌కు వెళ్లకుండా అడ్డుకునేందుకు ఆమెపై వైసీపీ వర్గీయులు రోడ్డుపై పడేసి గొడ్డళ్లతో తీవ్రంగా గాయపరిచారు.. అయినా వెనక్కి తగ్గని ఆమె రక్తపు గాయాలతోనే బూత్‌లో కూర్చొని వైసీపీ రిగ్గింగ్‌ను అడ్డుకున్నారు. మాచర్లలో ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డి గెలవాలి, రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని పట్టుదలగా నిలిచారు. పోలింగ్ అనంతరమే ఆమె ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకున్నారు. పార్టీ కోసం ఆమె అకుంఠిత దీక్ష, పట్టుదలను చంద్రబాబు గుర్తించి పదవి కట్టబెట్టారు.

పదవులు ఇలా..

- ఉండవల్లి శ్రీదేవి ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్
- దేగల ప్రభాకర్ ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- మన్నవ మోహనకృష్ణ ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్
- చిల్లపల్లి శ్రీనివాసరావు ఏపీ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- మంజులారెడ్డి ఏపీ శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్ అండ్ కల్చరల్ సొసైటీ ఛైర్మన్
- గోనుగుంట్ల కోటేశ్వరరావు ఏపీ గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్
- చిలకలపూడి పాపారావు ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్
- సజ్జా హేమలత ఏపీ హ్యాండ్‌లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్
- సలగల రాజశేఖర్‌బాబు బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(బాపుడా) ఛైర్మన్



మన్నవ మోహనకృష్ణ
దేగల ప్రభాకర్
చిల్లపల్లి శ్రీనివాసరావు
సలగల రాజశేఖరబాబు
గోనుగుంట్ల కోటేశ్వరరావు

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- మూడు జిల్లాల నుంచి పలువురు ఎంపిక
- ఈ నెల 11న విజయవాడలో అవార్డుల పంపిణీ

గుంటూరు(విద్య), నవంబరు 9: రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులు ఎంపికయ్యారు. ఈ నెల 11న విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో అవార్డులు పంపిణీ చేయనున్నారు.

- **పాఠశాల విభాగంలో** : బాపట్ల జిల్లా నుంచి కోట వెంకటశ్రీనివాసరావు(హెచ్‌ఎం జడ్పీహెచ్‌ఎస్, చక్రాయపాలెం, అద్దంకి మండలం), గోనేళ్ళ శేషవరలక్ష్మి(స్కూల్ అసిస్టెంట్ జడ్పీహెచ్‌ఎస్ ఈపూరుపాలెం చీరాల), పవని భానుచంద్రమూర్తి(ఏఆర్‌ఎం హైస్కూల్ పేరాల, చీరాల మండలం), కర్పూరపు బిజిలికుమార్ (ఎంపీపీఎస్, బలుసులపాలెం, చెరుకుపల్లి), గుంటూరు జిల్లా నుంచి డాక్టర్ చెన్నంశెట్టి రమేష్(ఎంపీయూపీ స్కూల్, మామిళ్ళపల్లి, పొన్నూరు), పెనుమూడి ముత్యం జయరావు(ఎంపీపీఎస్, కొల్లిపర)
- **ఇంటర్ విద్యలో**: బీ సౌజన్య (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల గుంటూరు), ఆర్‌వీఎస్ ప్రసాద్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల దుర్గి), ఎస్ శేషకుమారి (ప్రిన్సిపల్, ప్రభుత్వ జూ నియర్ కళాశాల పర్చూ రు).
- **టెక్నికల్ ఎడ్యుకేషన్ విభాగంలో**: పీ నీలిమ (ఎంటీటీఎస్ పాలిటెక్నిక్‌కళాశాల గుంటూరు)
- **ఉన్నత విద్యావిభాగం**: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, ఆచార్య ఎం తిరుపతిరావు, ఆచార్య అశోక్‌కుమార్, ఆచార్య పూర్ణచంద్రరరావు, డాక్టర్ పద్మజరావు, ఆచార్య డీ రామచంద్రన్, డాక్టర్ బిల్‌క్యూస్, డాక్టర్ ఎస్ విష్ణువర్థన్, డాక్టర్ జీ మోహన్‌నాయుడు



పవని భానుచంద్రమూర్తి (పేరాల)
గోనేళ్ళశేషవరలక్ష్మీ (ఈపూరుపాలెం)
డాక్టర్ చెన్నంశెట్టి రమేష్ (మామిళ్ళపల్లి)

కళాశాలను కాపాడుకున్నారు

- మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేరుకున్న వైనం
- దాతల సహకారంతో ఉచితంగా మధ్యాహ్న భోజనం
- ఇంటింటికీ వెళ్లి విజయాలు వివరిస్తున్న అధ్యాపకులు

ఉత్సాహంగా బేస్‌బాల్ పోటీలు

- 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల రాక
- యనమదల జడ్పీ హైస్కూల్‌లో తలపడుతున్న జట్లు

8

బోరుగడ్డ తీరు మళ్లీ వివాదాస్పదం

- పోలీస్‌స్టేషన్‌లోనే రిమాండ్ ఖైదీకి బల్లపై నిద్ర
- అరండల్‌పేట స్టేషన్ సీఐ శ్రీనివాసరావుపై వేటు

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

- పాత డొక్కు బస్సుల స్థానంలో వినియోగం
- గుంటూరు డిపోలకు 200 బస్సులకు ప్రతిపాదన
- మంగళగిరి, విజయవాడ, రాజధానికి రాకపోకలు
- మంగళగిరి, గుంటూరులో హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు

6

సర్కిల్స్ విభజన.. మారిన స్వరూపాలు

- గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సర్కిల్‌గా ప్రాధాన్యం
- ప్రస్తుతం రెండు, మూడు డివిజన్‌లకే పరిమితం

గఘన యానం

- విజయవాడ-శ్రీశైలం సీప్లేన్ ట్రయల్ రన్ సక్సెస్
- పున్నమిఘాట్ వేదికగా అద్భుత విన్యాసాలు
- ట్రయల్ రన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ప్రకాశం బ్యారేజీ, పులిచింతల, సాగర్ నుంచి శ్రీశైలం వరకూ..
- సీఎం, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తదితరుల ప్రయాణం
- ట్రయల్ రన్‌కు భారీగా తరలివచ్చిన పర్యాటకులు
- ప్రత్యేక ఆకర్షణగా రెయిన్‌బో రంగుల వెలుగులు

"రన్‌వేలు అవసరం లేదు.. విమానాశ్రయాలు అంతకంటే అవసరం లేదు.. నీరుంటే చాలు.. నేరుగా ల్యాండ్ అయిపోతుంది.. టేకాఫ్ అవుతుంది.. ఒక జెట్టీ, వాటర్ డ్రోమ్ ఉంటే చాలు.. రివ్వున ఆకాశంలోకి ఎగిరిపోయి.. అంతే వేగంగా కిందకు దిగిపోతుంది.. పర్యాటకులను అమితంగా ఆకట్టుకునే ఈ సరికొత్త సీప్లేన్ ట్రయల్ రన్ శనివారం అద్భుతంగా జరిగింది. పున్నమిఘాట్ వేదికగా, సుందరమైన కృష్ణాతీరంలో, ప్రకృతి అందాల నడుమ అటూ ఇటూ తిరిగిన ప్లేన్ విన్యాసాలను పర్యాటకులు ఆసక్తిగా తిలకించారు. పర్యాటకంపై సీఎం చంద్రబాబు ప్రసంగం, సప్తవర్ణాలను విరజిమ్మిన బాణసంచా పేలుళ్లు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి."



అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

పున్నమిఘాట్ వద్ద కృష్ణాతీరంలో శనివారం సీప్లేన్ ట్రయల్ రన్ అద్భుతంగా జరిగింది. ఘాట్‌లోని వాటర్ జెట్టీ వద్ద ఉదయం 10.05 గంటలకు సీప్లేన్‌ను నిలిపి ఉంచి, జెట్టీ వెనుక భాగంలో అధికారిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, బీసీ జనార్ధనరెడ్డితో పాటు ఎంపీ కేశినేని చిన్ని, స్పైస్‌జెట్ సీఎండీ అజయ్‌సింగ్, ఐఅండ్‌ఐ రాష్ట్ర, కేంద్ర అధికారులు ప్రసంగించారు. ఈ కార్యక్రమం అయిపోగానే, సందర్శకులు వీక్షించేలా టెంట్ తెరలు తొలగించారు. సరిగ్గా 12.45 గంటలకు సీప్లేన్ సర్వీసు కృష్ణానది నుంచి బయల్దేరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, ఇతర ఆహ్వానితులు ప్లేన్‌లోకి ఎక్కారు. ప్లేన్‌లోకి ఎక్కేముందు చంద్రబాబు అభివాదం చేయటంతో ప్రజలు హర్షధ్వానాలు చేశారు.

గ్రాండ్ వెల్కమ్

సీప్లేన్ డెమో లాంచ్‌కు భారీ ఏర్పాట్లు చేశారు. ప్రారంభ సూచికగా భవానీ ద్వీపం సమీపంలో కృష్ణానదిపై గ్రాండ్ ఫైర్‌వర్క్స్ జరిపారు. పడవలపై పెద్ద ఎత్తున ధ్వనిచేస్తూ సప్తవర్ణాలను ఆకాశంలోకి విరజిమ్మారు.



సీప్లేన్ సాగిందిలా..

కృష్ణానదిలో తూర్పు వైపునకు కదిలిన సీప్లేన్, ఆ వెంటనే యూటర్న్ తీసుకుని భవానీ ద్వీపం చెంతకు వెళ్లింది. ద్వీపం టవర్ సమీపంగా వెళ్లి, అక్కడి నుంచి వాయువేగంతో ముందుకు దూసుకెళ్లింది. ప్రకాశం బ్యారేజీతో పాటు నాగార్జున సాగర్, పులిచింతల డ్యామ్‌ల మీదుగా శ్రీశైలం డ్యామ్ వరకు ఈ సీప్లేన్ వెళ్లింది.



శ్రీబగళాముఖి అమ్మవారిని దర్శించుకున్న జడ్జి



రైల్వే జడ్జి రమాదేవి కుటుంబ సభ్యులకు అమ్మవారి చిత్రపటం బహూకరణ

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిట్టలవానిపాలెం మండలం, చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారిని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఫర్ రైల్వే పి.రమాదేవి తన కుటుంబ సభ్యులతో శనివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు ఆలయ మర్యాదలు, పూర్ణాకుంభంతో వారికి ఘనస్వాగతం పలికారు. ఆలయ అర్చకులతో వేద ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటాలను బహూకరించి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్జి పి.రమాదేవి శ్రీబగళాముఖి ఆలయంలో ఆధ్యాత్మిక మాస పత్రిక, ఆరాధన పుస్తకాన్ని ఉచితంగా భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఏఎన్‌యూ ప్రవేశ పరీక్ష

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికిగానూ రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సుల్లో ప్రవేశ పరీక్ష శనివారం సజావుగా జరిగినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర విద్య కేంద్ర పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్ తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తోపాటు ఆదిత్య డిగ్రీ కాలేజి (కాకినాడ), ఎంఎస్ఆర్ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజి (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజి (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజి (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజి (కర్నూలు), శ్రీసాయి డిగ్రీ కాలేజి (అనంతపూర్) ల్లో పరీక్ష జరిగిందన్నారు. ఆదివారం సాయంత్రం ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల చేస్తామన్నారు. అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 15వ తేదీలోగా ఆయా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు.

గూడ్స్ రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య

తెనాలి క్రైం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెనాలి-ఒంగోలు ప్రధాన రైలు మార్గంలో నిడుబ్రోలు-మోదుకూరు స్టేషన్ల మధ్య గుర్తుతెలియని యువకుడు గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని తెనాలి జీఆర్‌పీ ఎస్సై జి.వెంకటాద్రి శనివారం తెలిపారు. గుర్తుతెలియని 30 సంవత్సరాల యువకుడు ఒక్కసారిగా గూడ్స్‌కు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయం గుర్తించిన లోకో పైలెట్ వెంటనే తెనాలి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్‌కు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా బిస్కెట్ కలర్ ప్యాంట్, గళ్ల చొక్కా ధరించిన యువకుడు మృతి చెంది ఉన్నాడు. మృతదేహం వద్ద పగిలిపోయి ఉన్న సెల్‌ఫోన్ ఉంది. ఇతర వ్యక్తిగత సమాచారం లభించకపోవడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సర్కిల్స్ విభజన.. మారిన స్వరూపాలు

- గతంలో ఉమ్మడి జిల్లా అంతా సర్కిల్‌గా ప్రాధాన్యం
- ప్రస్తుతం రెండు, మూడు డివిజన్‌లకే పరిమితం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (సీపీ డీసీఎల్) పరిధిలోని ఉమ్మడి గుంటూరు జిల్లాలో సర్కిల్స్ విభజన ప్రక్రియతో స్వరూపాలు ఒక్కసారిగా మారిపోయాయి. గతంలో విద్యుత్ గుంటూరు సర్కిల్ స్థాయి చెప్పుకోవాలంటే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఐదు డివిజన్‌లతో విస్తరించి ఉండేది. ఇప్పుడు కేవలం రెండు డివిజన్‌లకే పరిమితమైపోవటంతో సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ ప్రాధాన్యం కూడా తగ్గింది. సర్కిల్స్ విభజన ప్రక్రియ ప్రస్తుతం ఆ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు సర్కిల్ స్థాయి గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లు కలుపుకొని కొత్త సర్కిల్‌గా ఏర్పాటు చేశారు. అలానే రాజధాని అమరావతి కేంద్రంగా కొనసాగుతున్న సీఆర్‌డీఏ సర్కిల్ గతంలో మాదిరిగానే గుంటూరు-2 డివిజన్, అమరావతి డివిజన్‌లతో అదే పరిధిలో ఉంది. ఇక కొత్తగా ఏర్పాటైన పల్నాడు సర్కిల్ రెండు డివిజన్‌లు కాగా బాపట్ల సర్కిల్ కూడా రెండు డివిజన్‌లకే పరిమితమయ్యాయి. నరసరావుపేట కేంద్రంగా ఏర్పాటు చేసిన పల్నాడు సర్కిల్ పరిధిలో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లు కలిపారు. కొత్తగా ఏర్పాటైన బాపట్ల జిల్లా కేంద్రంగా ఉన్న బాపట్ల సర్కిల్ పరిధిలో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు కలిపి సర్కిల్‌గా ప్రకటించారు. ఫలితంగా సర్కిల్స్ ప్రాధాన్యం తగ్గిపోయింది.

తగ్గిన గుంటూరు సర్కిల్ ప్రాధాన్యం

సీపీడీసీఎల్ గుంటూరు సర్కిల్ గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తరించి ఉండేది. సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి, నరసరావుపేట, మాచర్ల, బాపట్ల డివిజన్‌లతో మొత్తం ఐదు డివిజన్‌లతో ప్రత్యేక ప్రాధాన్యత ఉండేది. సర్కిల్ ఎస్ఈ స్థాయి కూడా ఐదు డివిజన్‌లను పర్యవేక్షించటం, జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులతో కీలకంగా వ్యవహరించేవారు. అటువంటిది ప్రస్తుత విభజనతో ఉమ్మడి జిల్లా గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌గా రూపాంతరం చెందటంతో ఆపరేషన్ ఎస్ఈల ప్రాధాన్యత తగ్గినట్లయింది. అయితే విభజన ప్రక్రియ పూర్తి చేసిన అధికార యంత్రాంగం ఆ స్థాయిలో సిబ్బంది నియామకాలు లేవని సిబ్బంది అంతర్గతంగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బందిపై అదనపు భారం పడుతోందని వాపోతున్నారు.

బెల్టు షాపు పెట్టినా.. ఎమ్మార్పీ ఉల్లంఘించినా..

- కఠిన చర్యలు తప్పవు
- నాటు సారా తయారీ పై ఉక్కుపాదం
- ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్
- గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులు, పక్కన ఏసీ రవి కుమార్ రెడ్డి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం వ్యాపారులు వారి షాపుల పరిధిలో బెల్టుషాపు పెట్టినా, షాపుల్లో మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ నాటుసారా తయారీపై ఉక్కు పాదం మోపుతున్నామని, ఎన్‌డీపీ లిక్కర్ అమ్మితే పీడీ యాక్ట్ పెడతామని ఆయన తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారన్నారు. బెల్టు షాప్ నిర్వహిస్తూ పట్టుపడితే మొదటిసారి లక్ష రూపాయలు జరిమానా, బైండోవర్ కేసులు పెడతామన్నారు. రెండో పర్యాయం పట్టుపడితే రూ.5 లక్షల జరిమానా, షాపు లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. అదేవిధంగా మద్యం అమ్మకాల్లో ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే మొదటిసారి రూ. 5 లక్షల జరిమానా, రెండోసారి షాపు లైసెన్స్ రద్దు చేస్తామని చెప్పారు. ఎస్‌టీఎఫ్, జిల్లా టాస్క్‌ఫోర్స్ విస్తృతంగా తనిఖీలు చేస్తుంటారని, డెకమ్ ఆపరేషన్ ద్వారా నిరంతరం నిఘా ఉంటుందన్నారు. నాటు సారా తయారు చేసినా, అమ్మినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పల్నాడు జిల్లాలో నరసరావుపేట, బొల్లాపల్లి, మాచర్ల బోర్డర్ ప్రాంతాల్లో నాటు సారా తయారవుతున్నట్లు సమాచారం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దాడులు చేపడతామన్నారు. పల్నాడు జిల్లాను నాటు సారా జిల్లాగా ప్రకటించేలా చేస్తామన్నారు. టీంలు ఏర్పాటు చేసి దాడులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. పోలీసులు, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులతో పాటు ఇతర అధికారులు కూడా భాగస్వాములు చేసి అవగాహన శిబిరాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఎన్‌డీపీ లిక్కర్ ఇతర రాష్ట్రాల నుంచి మన జిల్లాలోకి వస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దులైన తెలంగాణ, కర్ణాటక, గోవా, చెన్నై నుంచి ఎన్‌డీపీ లిక్కర్ వస్తుందని, దీనిని నివారించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్‌డీపీ లిక్కర్ అమ్మిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవి కుమార్ రెడ్డి, ఈఎస్‌లు అరుణ కుమారి (గుంటూరు), మణికంఠ (నరసరావుపేట), ఏఈఎస్‌లు మారయ్య బాబు, రవీంద్ర, పల్నాడు, గుంటూరు జిల్లాల సిఐలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో కొమ్మాలపాటి శ్రీధర్, ఏడు నియోజకవర్గాల పరిశీలకులు

నరసరావుపేట టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. శనివారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏడు నియోజకవర్గాల పరిశీలకులు, ముఖ్య నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులతో సమన్వయం చేసుకొని సభ్యత్వం వేగవంతం చేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉందంటే ఒక ధైర్యం, భరోసా ఉంటుందన్నారు. ఇప్పటికి 70 లక్షల సభ్యత్వంతో టీడీపీ దేశంలో బలంగా క్యాడర్, కార్యకర్తలు కలిగిన పార్టీగా ఎదిగిందన్నారు. యువనేత నారా లోకేశ్ సరికొత్తగా ఆలోచించి బీమా పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. చనిపోయిన ప్రతి ఒక్కరికి గతంలో రూ.2 లక్షలు చెల్లించేవారని, అయితే దానిని రూ.5 లక్షలకు పెంచడం ఒక భరోసాగా చెప్పవచ్చు అన్నారు. అంతేగాక మట్టి ఖర్చులకు రూ. 10 వేలు తక్షణ సహాయం కూడా అందిస్తున్నారని అన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్ల పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. అందుకనే ప్రజలు ఆ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశారని, కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో భాగంగా ప్రతి క్రియాశీలక సభ్యుడికి ప్రమాద బీమా వర్తింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, రాష్ట్ర నాయకులు ఎం.ధారునాయక్, నల్లపాటి రామచంద్ర ప్రసాదు, తాత జయప్రకాష్ నారాయణ, దాసరి ఉషారాణి, కళ్ళం రాజశేఖర్‌రెడ్డి, వేల్పుల సింహాద్రి యాదవ్, నాగోతు శౌరయ్య, కడియాల వెంకటేశ్వరరావు, వల్లెపు నాగేశ్వరరావు, గొట్టిపాటి జనార్దన్‌బాబు, కొట్టా కిరణ్, దాసరి ఉదయ్‌శ్రీ, కనుమూరి లక్ష్మి, కోసూర రాధిక తదితరులు పాల్గొన్నారు.

నేడు అటవీ అమరవీరుల సంస్మరణ దినం

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం స్థానిక కలెక్టర్ బంగ్లా రోడ్డులోని అరణ్య భవన్‌లో నిర్వహించాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఉదయం 10.30 గంటల నుంచి ఈ కార్యక్రమం జరుగుతుందని అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి ఆ డిపార్టుమెంట్ జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హాజరయ్యే అవకాశం ఉన్నట్లుగా పేర్కొన్నారు.

ఇటుకల కింద పడి వ్యక్తి మృతి

పెదకాకాని, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇటుకల లారీ పంక్చర్ కావడంతో బోల్తా కొట్టిన ఘటనలో ఇటుకలు మీద పడి దానిపై ఉన్న వ్యక్తి మృతి చెందినట్లు శనివారం పెదకాకాని పోలీసులు తెలిపారు. మృతుడిది తాడేపల్లిగూడెంగా పోలీసులు గుర్తించారు. తాడేపల్లిగూడెం నుంచి గుంటూరుకు ఇటుకలు సరఫరా చేస్తున్న లారీ మార్గమధ్యంలోని నాగార్జున విశ్వవిద్యాలయ ఎదుట పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. లారీ పైనున్న తాడేపల్లికు చెందిన సత్యనారాయణ(53) అనే వ్యక్తి కింద పడగా, అతనిపై ఇటుకలు పడి అక్కడికక్కడే మృతి చెందాడు.

నైట్‌షెల్టర్లు.. నామమాత్రమే

(5 పేజీ తరువాయి)

స్నానం తదితరాలు లేక, దుస్తులు శుభ్రం చేసుకునే పరిస్థితి లేక మురికిగా కాలం వెళ్లదీస్తుంటారు.

● గుంటూరులోని అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టాభిపురంలో మూడు ప్రాంతాల్లో నైట్‌షెల్టర్లు ఉన్నాయి. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ అపరిశుభ్రతతో అధ్వానంగా ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌ను ఒక్కో స్వచ్ఛంద సంస్థకు అప్పగించినా వాటిని నిర్వహించలేక బాధ్యతల నుంచి ఆయా సంస్థలు వైదొలిగాయి. గత ఐదేళ్ల ఈ కేంద్రాల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో ఆశ్రయం కోసం వచ్చే నిరాశ్రయులకు కనీస సౌకర్యాలు ఇక్కడ ఉండటంలేదు. ఉండటానికి పెద్ద పెద్ద గదులున్నా సరైన బెడ్స్, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు నిరాశ్రయులు, అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. అరండల్‌పేట ఒకటో లైన్‌లోని నైట్‌షెల్టర్ పరిసరాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంది. కొన్ని రోజులుగా ఈ సెంటర్ తాళాలు కూడా తీయడంలేదని సమాచారం. బస్టాండ్ వద్ద ఉన్న కేంద్రానికి విద్యుత్ సరఫరా లేక అరకొర వచ్చే వారు కూడా దోమల బాధ తట్టుకోలేక వెళ్తున్నారు. పట్టాభిపురంలోని సెంటర్లో అయితే ఇద్దరు ముగ్గురు కూడా లేరు. దీంతో జీజీహెచ్ వద్ద అయితే రాత్రిళ్లే కాక పగలు కూడా వందల సంఖ్యలో ఉంటుంటారు. ఎవరైనా ఆహారం తెచ్చి పెడితే తిని అక్కడే ఎండకు, వానకు, చలికి అల్లాడుతుంటారు.

● తెనాలిలో బాలాజీరావుపేటలో గతంలో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్ వైసీపీ హయాంలో మూతపడింది. నందులపేటలోని నైట్‌షెల్టర్‌లో సుమారు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేంద్రాల గురించి తెలియక పెద్దసంఖ్యలో అభాగ్యులు రోడ్లపై ఆశ్రయం పొందుతున్నారు.

● పొన్నూరులో దశాబ్దాలుగా నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బిచ్చగాళ్ల, ఏ ఆశ్రయం లేని వారు పట్టణ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై జీవనం సాగిస్తున్నారు. ఓవర్‌బ్రిడ్జి, రైల్వేప్లాట్‌ఫాంలపై 35 మంది వరకు రాత్రి వేళ సేదతీరుతున్నారు.

● నరసరావుపేటలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణకు నిధుల కొరత నెలకొంది. గుంటూరురోడ్డులోని వసతిగృహాన్ని మూసేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మరో వసతి గృహంలో 25 మంది మహిళలు ఉంటున్నారు. అయితే ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని నిర్వాహకులు తెలిపారు.

● పిడుగురాళ్లలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ కొన్నేళ్లుగా ఉంది. ఇక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. అయితే అక్కడ ఉండేవారికన్నా రోడ్ల మార్జిన్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే అభాగ్యులే అధికం.

● వినుకొండలో ఐదేళ్లుగా నిరాశ్రయులకు వసతిగృహం కొనసాగుతుంది. దాతల సాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే ఇక్కడ అందరికీ కాకుండా కొందరికే ఆశ్రయం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 30 మందికి అవకాశం ఉన్నా కేవలం 14 మందికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ కొరగా ఆశ్రమానికి మున్సిపాలిటికి ఎటువంటి సంబంధంలేదన్నారు.

● చిలకలూరిపేటలో ప్రస్తుతం ఎటువంటి నైట్‌షెల్టర్లు లేవు. కొన్నేళ్ల క్రితం ఏఎంజీ సంస్థ కుమ్మరికాలనీలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. అయితే దీనిని ఉపయోగించుకునే వారు లేకపోవడంతో మూసివేశారు.

● మాచర్లలోని రామాటాకీస్‌లైన్‌లో స్వశక్తి రూరల్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ ఉంది. అయితే దీని గురించి నిరాశ్రయులకు సమాచారం లేదు. ఇక్కడ ఐదుగురికే ఆశ్రయం పొందే అవకాశం ఉంది.

● బాపట్లలోని రైలుపేటలో మెప్మా పర్యవేక్షణలో ఐదేళ్లుగా ఉన్న నైట్‌షెల్టర్‌లో 15 మంది ఉండటానికి అవకాశం ఉంది. అయితే 15 మందికి ఒకే మరుగుదొడ్డితో ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ మరో మూడు మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు కూడా అందజేశారు. నిర్వాహకులకు ఏడాది నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు.

● రేపల్లెలోని ఐదో వార్డులోని నైట్‌షెల్టర్‌లో నామమాత్రపు వసతులు ఉండటంతో బసకు ఎక్కువ మంది రావడంలేదు. గతంలో 40 మందిపైనే ఉండేవారు, ఇప్పుడు 16 మంది మాత్రమే ఉంటున్నారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

భార్యను పుట్టింటి వారు తీసుకెళ్లారని..

యువకుడి ఆత్మాహత్యాయత్నం

- సెల్ టవర్ ఎక్కి ఐదు గంటల పాటు హల్ చల్



సెల్ టవర్ ఎక్కిన యువకుడు

క్రోసూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : భార్యను పుట్టింటి వారు బలవంతంగా తీసుకు వెళ్లారని, ఆమెను పంపించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని క్రోసూరుకు చెందిన మస్తాన్‌వలి శనివారం సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేశాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో క్రోసూరు నడిబొడ్డున ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ పైకి ఎక్కి అక్కడి నుంచి దూకుతానని, తన భార్యను తనకు చూపించే వరకు దిగేది లేదని భీష్మించుకొని కూర్చున్నాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమయ్యారు. యువకుడిని దిగి రావాలని క్రోసూరు ఎస్ఐ నాగేంద్రరావు పలు మార్లు ఫోన్‌లో కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరుకు చెందిన షేక్ మస్తాన్‌వలి(23), మేడికొండూరు మండలం సిరిపురం గ్రామానికి చెందిన షేక్ దిల్షాద్(19) కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో అమ్మాయి తరుపు వారు వీరి ప్రేమకు, వివాహానికి అడ్డు చెబుతూ వస్తున్నారు. మస్తాన్‌వలి దిల్షాద్‌ను తీసుకొని తూర్పు గోదావరి జిల్లా తణుకు వెళ్లి బుద్ధ అండ్ హెజ్ ధర్మ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన వివాహం చేసుకున్నాడు. వివాహానికి సంబంధించి ఆ సంస్థ వారు ధ్రువీకరణ పత్రం కూడా ఇచ్చారు. దిల్షాద్‌ను తీసుకొని క్రోసూరు వచ్చిన మస్తాన్‌వలి తమ సంప్రదాయం ప్రకారం ఈనెల 7వ తేదీన క్రోసూరులో ఆమెను మళ్లీ వివాహం చేసుకోవటానికి పూనుకున్నాడు. విషయం తెలుసుకున్న అమ్మాయి తరుపు వారు సిరిపురం గ్రామం నుంచి వచ్చి అమ్మాయిని తీసుకు వెళ్లారు. వెంటనే మస్తాన్‌వలి తన భార్యను పుట్టింటి వారు బలవంతంగా తీసుకు వెళ్లారని క్రోసూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ అనంతరం పోలీసులు కేసు నమోదు చేశారు. అమ్మాయిని తీసుకు రావటంలో పోలీసులు తాత్సారం చేస్తున్నారని ఆరోపిస్తూ యువకుడు మస్తాన్‌వలి సెల్ టవర్ పైకి ఎక్కి అమ్మాయిని పంపించక పోతే దూకి చనిపోతానని చేశాడు. సిరిపురం నుంచి దిల్షాద్‌ను తీసుకొని వచ్చిన పోలీసులు అతనికి చూపించటంతో సెల్ టవర్ దిగి వచ్చాడు.

జపాన్ సకురా సైన్స్ ప్రాజెక్టుకు విజ్ఞాన్ అధ్యాపకులు ఎంపిక



ఎంపికైన అధ్యాపకులతో వీసీ ఆచార్య నాగభూషణ్

గుంటూరు(విద్య), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్టు 2024కు ఎంపికయ్యారని వీసీ ఆచార్య పి.నాగభూషణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్సిటీలోని బయోటెక్నాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఎస్ సంపత్‌కుమార్, డాక్టర్ చింతగుంట ఆంజనిదేవి టోక్యోలో ఏడు రోజుల పాటు సైన్స్ ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. యూనివర్సిటీ ఆఫ్ మియజాకీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సకురా ప్రాజెక్టులో పాల్గొంటారని తెలిపారు. భారతదేశం నుంచి కేవలం 12 మంది ఎంపిక కాగా వారిలో ఇద్దరు విజ్ఞాన్ విశ్వవిద్యాలయానికి చెందిన వారు ఉన్నారని తెలిపారు. అధ్యాపకుల్ని రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వివిధ విభాగాల డీన్లు అభినందించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	123, 132,142
చికెన్ విత్ స్కిన్	230.00
చికెన్ స్కిన్ లెస్	240.00

సోషల్ మీడియా విషసంస్కృతిని సమాధి చేయాలి : కొల్లా

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సోషల్‌మీడియా ద్వారా విష ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి డిమాండ్ చేశారు. జగన్మోహనరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పిన ప్రకారమే చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌ను తిట్టామని నటి శ్రీరెడ్డి వీడియో విడుదల చేయటం జరిగిందన్నారు. దీనిప్రకారం సోషల్ మీడియా మూకలకు డబ్బులిచ్చి పోషిస్తూ ప్రత్యర్థులపై విషప్రచారం చేస్తున్నారన్నారు. ఈ విష సంస్కృతిని సమాధి చేయటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టటం హర్షణీయమని కొల్లా అన్నారు.

చెక్‌పోస్టుల వద్ద సక్రమంగా విధులు నిర్వహించాలి

● ఇసుక రవాణాకు సంబంధిత పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్
● ఆర్డీవో రామలక్ష్మి



కొల్లూరు కరకట్టపై ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి

కొల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇసుక రవాణాకు సంబంధిత పత్రాలు లేకపోతే వాహనాలు స్వాధీనం చేసుకోవాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని గాజుల్లంక, అరవింద వారిధి ఇసుక రీచ్‌లను శనివారం ఆమె పరిశీలించారు. తొలుత దోనేపూడి, కొల్లూరు లాక్కు సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వద్ద ఉన్న రికార్డులను సైతం ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి కార్యదర్శులు ఇసుక కోసం ఇస్తున్న పత్రాలను కూడా పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. ఎక్కడా ఇసుక అక్రమ రవాణా లేకుండా ఉచిత ఇసుక లబ్ధిదారులకు చేరే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశీలనలో వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలి

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 18ఏళ్ళు నిండిన యువత ప్రతి ఒక్కరూ ఓటుహక్కును నమోదు చేసుకోవాలని రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. ఎస్ఎస్ఆర్ 2025లో భాగంగా రేపల్లె నియోజకవర్గంలో నిర్వహించే స్పెషల్ క్యాంపెయిన్ డే ఓట్ల పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ ఆదేశాల ప్రకారం 9,10తేదిల్లో స్పెషల్‌క్యాంపెన్‌డేగా ఏర్పాటుచేసి పోలింగ్‌కేంద్రాల వద్ద కొత్త ఓట్లు చేర్చే ప్రాంతాలను పరిశీలించటం జరిగిందన్నారు. ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు వచ్చే క్లైమ్స్‌ను తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, బూత్‌లెవల్ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన వసతి గృహంలో న్యాయ సేవా దినోత్సవం

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజయ్‌గాంధీకాలనీలో గల ఎస్టీ గిరిజన కళాశాల వసతి గృహంలో శనివారం న్యాయసేవా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ప్యానల్ లాయర్‌లు భీమా లీలాకృష్ణ, అంగలకుదురు నటరాజు, పారా లీగల్ వలంటీర్లు కనపర్తి రాజారావు, పొందగల ప్రసాదరావు తదితరులు పాల్గొని విద్యార్థులకు న్యాయ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఖాళీస్థలం లీజుకు వేలం

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీలింగోద్భవ దేవస్థానానికి సంబంధించి మూడు సంవత్సరాల కాలపరిమితికి 15 సెంట్ల ఖాళీస్థలాన్ని లీజుకిచ్చేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు దేవదాయ శాఖ బాపట్ల డివిజన్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో బహిరంగ వేలం నిర్వహిస్తారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆసక్తి కలిగిన పాటదారులు రూ.5 వేలు డిపాజిట్‌గా రుసుం చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చునని చెప్పారు.

ఉపాధి కోసం శ్రమజీవులంతా ఉద్యమిద్దాం

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల శ్రమజీవులు ఉపాధి కోల్పోతున్నారని, ఉపాధి కోసం ఉద్యమిద్దామని సీపీఐ(ఎంఎల్)న్యూడెమొక్రసి రాష్ట్ర నాయకుడు ఆర్.మోహన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్‌భవన్‌లో శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వర్థంతి సభ జరిగింది. సభకు ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి జె.కల్పన అధ్యక్షత వహించగా మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కార్పొరేట్‌ల వద్ద ఉన్న భూములను పంపిణీ చేయాలని, పరిశ్రమలు స్థాపించి ప్రజలకు పని కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎన్.విష్ణు, అఖిల భారత రైతు కూలీసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్, పివోడబ్ల్యూ పట్టణ అధ్యక్షురాలు కొండా అన్నమ్మ, కార్యదర్శి షేక్ అజిత, డివిజన్ కార్యదర్శి మువ్వల పల్లవి, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు బి.లాజర్, ఎంపీ రంజాన్, మువ్వల రాఘవులు, ఎ.శ్రీను, ఎస్‌డి హఫీజు, నాగూర్‌బి, సుధారాణి పాల్గొన్నారు.

నేడు భక్తి గీతాలాపన కార్యక్రమం

వేమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీసాయిరామ జానకి భక్త సమాజం చదలవాడ ఆధ్వర్యంలో మండలంలోని చదలవాడ గ్రామంలో ఆదివారం సాయంత్రం 6గంటలకు శివాలయ ప్రాంగణంలో భక్తి గీతాలు ఆలాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రత్యేక శిక్షకులు బొల్లిముంత కృష్ణమాస్టర్ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం భక్త సమాజ సభ్యులు కరపత్రాలను విడుదల చేశారు. కృష్ణ మాస్టర్ మాట్లాడుతూ 20 మంది సభ్యులకు రెండు నెలల పాటు భక్తి గీతాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. బెల్లంకొండ వెంకట్ పర్యవేక్షణలో నిర్వహించే గీతాలాపన కార్యక్రమంలో భక్త సమాజం సభ్యులు పాల్గొంటారని తెలిపారు. పెద్దిరాజు ఆర్కెస్ట్రా బృందం సహకారం అందించనున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

అమృతలూరు, నవంబరు, 9 (ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని కూచిపూడిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ అమర్‌వర్ధన్ తెలిపారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 65 క్వింటాళ్ల రేషన్ బియ్యంను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఆలపాటి వనజాక్షి సంస్మరణ సభలో పాల్గొన్న ఆనందబాబు

వేమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాతృమూర్తి వనజాక్షి సంస్మరణ కార్యక్రమం ఏలూరు జిల్లా వేదగిరి గ్రామంలో శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై వనజాక్షి చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వనజాక్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేమూరు ఎమ్మెల్యే ఆనందబాబు

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు మతోన్మాద విధానాలను ఆపాలి



సీపీఎం మహాసభల్లో మాట్లాడుతున్న డి.రమాదేవి తదితరులు

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు భారంగా మారుతున్న ధరలను తగ్గించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ మతోన్మాద విధానాలు ఆపకపోతే పాతప్రభుత్వానికి పట్టిన గతేపడుతుందని సీపీఎం రాష్ట్రకార్యవర్గసభ్యులు డి.రమాదేవి అన్నారు. శనివారం స్థానిక మైనేని సీతారామయ్య కల్యాణ మండపంలో సీపీఎం రేపల్లె పట్టణ రెండవ మహసభలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ధరల పెంపకంవల్ల ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్రప్రభుత్వం ప్రజల సమస్యలను పక్కనపెట్టి మతం పేరుతో అస్థిత్వ ఉద్యమాలను ముందుకు తీసుకుని వెళ్ళుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిహెచ్ మణిలాల్, కేవీలక్ష్మణ్‌రావు, వై.కిషోర్, యార్లగడ్డ శివయ్య, కె.ఆశీర్వాదం, కేవీలక్ష్మణ్‌రావు, జే.ధర్మరాజు, కె.ఝాన్సీ, వి.నాగరాజు,కె.రమేష్‌తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు దారుణం

● మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి భయపెట్టటం, వారిని చిత్రహింసలకు గురిచేయటం దారుణమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున అన్నారు. ఈవిషయమై మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు శనివారం ఎస్పీ తుషార్‌డూడికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి తదితర నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎవరు అధికారంలో ఉన్న ఈవిధంగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. సోషల్‌మీడియావారిపై పోలీసులు అక్రమ కేసులు పెట్టరాదని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, అద్దంకి ఇన్‌చార్జి హనిమిరెడ్డి, వడ్డిముక్కల డేవిడ్ ఉన్నారు.

విగ్రహం ఏర్పాటుకు రాజకీయాలు ఆపాదించరాదు

● మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణ సమయంలో తీసిన విగ్రహాలు తిరిగి ఏర్పాటు చేయటానికి రాజకీయాలు ఆపాదించటం సరికాదని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మాజీ గవర్నర్ కోనప్రభాకరరావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు దిమ్మె నిర్మిస్తుంటే టీడీపీనాయకులు, అధికారులు అడ్డుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విషయమై శనివారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ సందర్భంగా తొలిగించిన విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలన్న నిబంధన పెట్టుకున్నామని దీనికి అధికారులంతా ఆమోదిస్తూ తీర్మానం కూడా చేశారన్నారు. అధికారులు మారినంత మాత్రన నిర్ణయాలు మారవని ఆయన అన్నారు. ఈ విషయంలో అవసరమైతే కోర్టుకెళ్ళి ఆర్డర్ తీసుకొస్తామని చెప్పారు. వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా నాయకుడు చల్లా రామయ్య ప్రశ్నించటానికి వెళితే అతనిపై దాడిచేయటం సరికాదన్నారు. సమావేశంలో ఎంపీపీ చినపోతుల హరిబాబు, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, కోకి రాఘవరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జోగి రాజా, వడ్డిముక్కల డేవిడ్, చింతల రాజశేఖర్, సముద్రాలగౌడ్ తదితరులు ఉన్నారు.

డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు అరెస్టు

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్తాయపాలెం గ్రామ సమీపంలోని ఓ లాడ్జి దగ్గర డిఫెన్స్ మద్యం విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.గీతిక సిబ్బందితో కలిసి దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 9 ఫుల్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా డిఫెన్స్ మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. దాడులు చేసిన వారిలో ఎస్సైలు డి.ప్రభుదాసు, ఎస్.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

అభివృద్ధి పనుల ప్రణాళికపై సమీక్షించిన ఎంపీ

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికపై ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ శనివారం సమీక్షించారు. కలెక్టరేట్‌లోని ఎంపీ ల్యాడ్స్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, జిల్లా అధికారులతో నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు గురించి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వచ్చే ఎంపీ ల్యాడ్స్‌తో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి దిశ, నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు, వివిధశాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బావుడా చైర్మన్‌గా సలగల రాజశేఖరబాబు

● నాయకుల అభినందనలు



రాజశేఖరబాబును సన్మానిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబును నియమించారు. ఆయన నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు. విద్యానగర్‌లోని ఆయన నివాసం వద్ద కూటమి నాయకులు శనివారం పెద్దఎత్తున తరలివచ్చి ఘనంగా సత్కరించి సన్మానించారు. రాజశేఖరబాబును సన్మానించిన వారిలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, సీనియర్‌నాయకులు కర్పూరపు రామారావు, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు బడుగు నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, ఎస్సీసెల్ అధ్యక్షుడు పసుమర్తి యలమంద, గొర్రెముచ్చు ఆనందరావు, మాజీ కౌన్సిలర్ పరిశా రమేష్‌గౌడ్, క్రిస్టియన్ సెల్ నాయకులు జంగం ప్రవీణ్‌కుమార్, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, దగ్గుమల్లి సుభాషణరావు, దాసరి శ్యాంబాబు, శ్యామ్‌లివింగ్‌స్టన్, పేరలి ధనుంజయ, మద్దాల ముసలయ్య, జిట్టా శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, బండి రామ్మూర్తినాయుడు తదితరులు ఉన్నారు.

● కర్లపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారటీ చైర్మన్ నూతనంగా ఎన్నికైన సలగల రాజశేఖరబాబుకు కర్లపాలెం మండలంలోని పలువురు నాయకులు దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో టీడీపీ నాయకులు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ నామన వెంకటశివన్నారాయణ, హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, హైవెండ్ హైస్కూల్ డైరెక్టర్ మేరువ ఆంజనేయప్రసాద్, చీరాల శ్రీనివాసరెడ్డి, మద్దాల ముసలయ్య, ఏపూరి భూపతిరావు, నక్కల వెంకటస్వామి, పమిడి భాస్కరరావు, పమిడి రవీంద్ర, వ్యవసాయ సహకార పరపతి సంఘం మాజీ అధ్యక్షుడు పెదమల్లు రంగారావు, జనసేన మండలాధ్యక్షుడు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షుడు చిలకల సురేంద్రబాబు, మాడా శ్రీనివాసరావు, పిట్ల వసంతరెడ్డి, పఠాన్ అహ్మద్ బాషా, బాబుమేస్త్రీ, మంతెన వెంకటరామరాజు, బొద్దుకూరి విజయ, కాగిత వీరయ్య, వందనం, దాసు, కట్టా సుజాత, బలరామరాజు, చీరాల సత్యనారాయణ రెడ్డి, మునిపల్లి చిన్న, సర్పంచ్ పీటా శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మెకానిక్ బాబు తదితరులు తెలిపారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కోస్తాతీరప్రాంతంలోని మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు. రేపల్లెమండలం లంకేవానిదిబ్బ గ్రామానికిచెందిన పాపారావును జనసేన పార్టీ నుంచి అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చైర్మన్‌గా నియమించటంపై వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

చుండూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులకు వివిధ రాయితీలతో పాటు మిగులు ఆదాయం లభిస్తుందని విద్యుత్ శాఖ గుంటూరు, పల్నాడు జిల్లాల నోడల్ అధికారి నూతలపాటి సింగయ్య తెలిపారు. యడ్లపల్లిలో విద్యుత్ శాఖ ఎఈ అర్జునరావు పర్యవేక్షణలో శనివారం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మూడు కిలో వాట్ల సౌర పలకాలు ఏర్పాటు చేసుకున్న ప్రతి వినియోగదారుడికి ప్రభుత్వం రూ.75వేలు సబ్సిడీ రూపంలో అందుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో 250 యూనిట్లు పైగా వినియోగించుకుంటున్న వినియోగదారులను గుర్తించి ఈ పథకం ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామస్తులు విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యాజలి హైస్కూల్‌లో తృతీయ సోపాన్‌టెస్టింగ్ క్యాంప్

కర్లపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉమ్మడి గుంటూరు జిల్లా తృతీయ సోపాన్‌టెస్టింగ్ క్యాంప్ ప్రారంభించారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన 16 పాఠశాలలు నుంచి 123 మంది స్కౌట్స్ విద్యార్థులు పాల్గొన్నారని క్యాంప్ ఆఫీసర్ డి.ఎల్.నారాయణ తెలిపారు. ఈ క్యాంప్ ఈనెల 9 నుంచి 13 వరకు జరుగుతుందన్నారు. స్కౌట్స్ పతకావిష్కరణ కార్యక్రమాన్ని స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పి. శ్రీనివాసరావు చేశారు. ప్రధానోపాధ్యాయులు కాకుమాను లాజర్‌బాబు, బాపట్ల జిల్లా డీవోసీ బి.రవీంద్రబాబు, నజీర్, ఎస్.అచ్చిరెడ్డి, టి.నరేష్‌కుమార్, ఎం.శ్రీహరి, వర కమలకుమారి పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్టు

కొల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్‌శాఖ అధికారులు అరెస్టు చేశారు. శనివారం వేమూరు ఎక్సైజ్ సిఐ రవికి మండల పరిధిలోని జువ్వలపాలెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో బెల్టు షాపుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలి

రేపల్లె, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కూచినపూడి పీఎస్‌సీ వైద్యులు డాక్టర్ ప్రణవి అన్నారు.శనివారం కూచినపూడిలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ తొలిదశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేసే అవకాశం ఉందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎన్ఎం ఆశావర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

అమృతలూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రవణా నక్షత్రం, కోటి సోమవారం పురస్కరించుకుని పలు శైవ క్షేత్రాల్లో స్వామి వారికి శనివారం ప్రత్యేక అలంకరణ చేశారు. వేకువజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపారు. కూచిపూడి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారిని సుందరంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఆలయాల్లో గోపూజలు

వేమూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం అష్టమి తిది శ్రవణా నక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలలో గోపాష్టమి ఉత్సవంలో భాగంగా గోపూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ఆలయ ప్రదక్షిణలు చేశారు.

● కర్లపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెంలోని శ్రీబధిరి కేదారేశ్వరస్వామి శివాలయంలో కోటి సోమవారంలో భాగంగా శనివారం శివపార్వతులకు విశేష పూజలు, అభిషేకాలను పురోహితులు ఘనంగా నిర్వహించారు. భక్తులు శివాలయ ప్రాంగణంలో ప్రమీదలను, ఒత్తులను వెలిగించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు శివపార్వతులను దర్శించుకొని విశేష పూజలలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీమద్భాగవత సప్తాహ రెండవ జ్ఞాన యజ్ఞం

కొల్లూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీమద్భాగవత సప్తాహ రెండవ జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని అనంతవరం గ్రామంలోని శ్రీవేణుగోపాలస్వామి, సప్త కోటేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విష్ణుభొట్ల వెంకటచలపతి భక్తులకు ప్రవచనాలు చేశారు.

12న గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం

భట్టిప్రోలు (కొల్లూరు), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 12న 247వ గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం నిర్వహిస్తున్నట్లు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమం అధ్యక్షురాలు అరుణకుమారి శనివారం తెలిపారు. భట్టిప్రోలులోని ఆశ్రమంలో మంగళవారం చాతుర్మాస్య వ్రత దీక్ష సమాప్తి, కర్పూర యజ్ఞాన్ని విశ్రాంత ఉపాధ్యాయులు మాజేటి వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తారన్నారు.

రామయ్యను పరామర్శించిన దివ్యాంగులనాయకులు

బాపట్ల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ, టీడీపీ శ్రేణుల తోపులాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జిల్లా దివ్యాంగుల నాయకుడు చల్లా రామయ్యను వైసీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్‌రాజు బందెల శనివారం పరామర్శించారు. దీనికి కారకులైన వారిపై 2016 దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

కళాశాలను... కాపాడుకున్నారు!

1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థుల్లేక మూసివేసే పరిస్థితి. ఈ క్రమంలో గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విలీనం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎలాగైనా కళాశాలను నిలుపుకోవాలని గ్రామస్తుల తపన. ఈ దశలో వారు చేసిన చిరు ప్రయత్నం కళాశాలకు మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేర్చింది. ఆ ప్రయత్నమే దాతల సహకారంతో ఉచిత మధ్యాహ్న భోజన పథకం. అంతే నేడు కళాశాల పరిస్థితి మారిపోయింది. ఇదీ దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విజయగాథ.

- మంగళం పాడే దశ నుంచి మహర్దశకు చేరుకున్న వైనం
- దాతల సహకారంతో ఉచితంగా మధ్యాహ్న భోజనం
- ఇంటింటికీ వెళ్లి విజయాలు వివరిస్తున్న అధ్యాపకులు

(దాచేపల్లి, నవంబరు 9, ఆంధ్రజ్యోతి) రెండు దశాబ్దాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. 1982లో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. 2001 నాటికి కళాశాలలో చేరే విద్యార్థు ల్లేక మూసివేసి గురజాలలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కలిపే పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో దాచేపల్లిలోని గ్రామస్తులంతా ఐక్యంగా కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే పేద విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం, ప్రభుత్వానికి చెల్లించాల్సిన కాలేజీ ఫీజు కూడా తామే స్వయంగా చెల్లించి విద్యార్థులు కాలేజీలో చేరే విధంగా కృషి చేశారు. వారి కృషి ఫలించి కళాశాలను ఎత్తివేసే పరిస్థితుల నుంచి కేవలం సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులతో కళాశాలను కొంతకాలం నడిపారు. పిల్లల్లో మరింత ప్రతిభను సాధించేందుకుగానూ ట్యూషన్లు పెట్టి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచారు. ఫలితంగా కేవలం రెండు అంకెలకే పరిమితమైన విద్యార్థుల సంఖ్య మూడు అంకెలకు చేరింది. ప్రస్తుతం కళాశాలలో 178 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో కళాశాల అభివృద్ధి కమిటీ విన్నపం మేరకు ఇంటర్ బోర్డు ఎంపీసీ, బైపీసీ గ్రూపులను కూడా మంజూరు చేసింది. 2020-21లో 100 శాతం, 2021-22లో 100 శాతం, 2022-23 సంవత్సరంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించింది. 2022-23లో కళాశాలకు చెందిన పానుబోతు మానస 965 మార్కులు సాధించి ఐఐటీలో సీటును దక్కించు కుంది. కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అధికంగా ఉన్నారు. ఆయా విద్యార్థుల కుటుంబాలు వ్యవసాయ కూలీలు, కార్మిక వర్గాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేందుకు మధ్యాహ్న భోజనం తోడ్పడింది.

స్థానికుల ప్రశంసలు

ప్రభుత్వం ఒకటి నుంచి 10వ తరగతిలోపు విద్యార్థులకు మాత్రమే మధ్యాహ్న భోజనం అందిస్తుంది. దాచేపల్లిలో కొంతమంది దాతలు ఇచ్చిన నగదుతో కళాశాల అభివృద్ధి కమిటీ చేపట్టిన మధ్యాహ్న భోజనం నిర్విరామంగా రెండు దశాబ్దాలుగా కొనసాగించడం స్థానికులచే ప్రశంసలు అందుకుంటుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్కడా కూడా ఇంటర్ విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం అందుబాటులో లేదు. ఇది కేవలం దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘనతే. ఇదే విధానాన్ని దాతల సహకారంతో మరింత మెరుగ్గా కొనసాగించేందుకు అభివృద్ధి కమిటీ చర్యలు తీసుకుంటుంది.



దాచేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

విద్యతోపాటు..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అధ్యాపకులు ఉదయం 7 గంటల సమయంలో గ్రామాల్లో తల్లిదండ్రుల వద్దకు వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని కోరుతూ గత విద్యార్థులు సాధించిన ఫలితాలను, విజయాలను వివరిస్తున్నారు. విద్యతోపాటు ఉచిత భోజనం కూడా అందజేస్తున్నామని తెలియజేస్తున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని అర్హతలు ఉన్న అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందిస్తుందని తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. విద్యార్థులను కళాశాలలో చేర్పించే విధంగా కృషి చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డును వారికి అందించడంతో అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు ఏర్పడుతున్నాయి.



విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖరబాబు, ఇతర అధ్యాపకులు

పేద విద్యార్థులకు అండగా..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులంతా నిరుపేద కుటుంబాలకు చెందినవారే. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం నిర్వహించడంతో విద్యార్థులకు కొంత ఆర్థికంగా వెసులుబాటు కలిగింది. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు భోజనానికి ఇంటికి వెళ్లకుండా కాలేజీలో చేయడంతో తరగతు లకు గైర్హాజరు శాతం తగ్గింది. ఫలితంగా ఉత్తీర్ణత 100 శాతం సాధిస్తున్నాం.



- చంద్రశేఖరబాబు, కళాశాల ప్రిన్సిపాల్

ప్రభుత్వం సహకరించాలి

గత 21 సంవత్సరాలుగా దాతల సహకారంతో ప్రభుత్వ కళాశాలలో ఉచిత భోజనం అందిస్తున్నాం. ప్రభుత్వం ముందుకొచ్చి మధ్యాహ్న భోజనానికి తమ వంతుగా సహకరించాలి. తద్వారా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో చేరేందుకు అవకాశం ఉంది.



-తెలనాకుల సత్యనారాయణ, అభివృద్ధి కమిటీ చైర్మన్

హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా ఘన విజయం



సాత్విక్ (68 పరుగులు)



రాజేష్ (4 వికెట్లు)

మంగళగిరి సిటీ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న కూచ్ బెహర్ ట్రోఫీలో హిమాచల్‌ప్రదేశ్ జట్టుపై ఆంధ్రా జట్టు 200 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఆంధ్రా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 615 పరు గులు సాధించి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకు ఆలౌటైన హిమాచల్‌ప్రదేశ్ జట్టు ఫాలో న్‌తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించి 103.5 ఓవర్లలో 283 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఆ జట్టులో సాత్విక్ కటోచ్ 9 ఫోర్లతో 68 పరుగులు చేసి రాణించాడు. ఆంధ్రా బౌలర్ ఎన్.రాజేష్ 30.5 ఓవర్లలో 73 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. దీంతో ఆంధ్రా జట్టు ఇన్నింగ్స్ 200 పరుగులతో ఘనవిజయం సాధించింది.

రసవత్తరంగా రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు

ప్రత్తిపాడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీలు ప్రత్తిపాడు మండలం యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రసవత్తరంగా సాగాయి.



పోటీలలో తలపడుతున్న జట్లు

బాలురు, బాలిక విభాగాలకు సంబంధించి వివిధ జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో క్రీడాకారులు తమ సత్తా చాటారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల పరిధిలో ఈ పోటీలు జరిగాయి. 13 జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు ఈ పోటీలలో తలపడ్డాయి.

బాలుర విభాగంలో..

గుంటూరు, విశాఖపట్నం జిల్లాల జట్లు పోటీలో తలపడగా, గుంటూరు జిల్లా బాలురు 5-2 తేడాతో విజయం సాధించారు. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల మధ్య జరిగిన పోటీలో 7-2 తేడాతో శ్రీకాకుళం జిల్లా, విజయనగరం, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో 2-1 తేడాతో కర్నూలు జిల్లా, అనంతపురం, చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన పోటీలలో 5-4 తేడాతో అనంతపురం జట్లు విజయం సాధించాయి. చివరి లీగ్ మ్యాచ్‌లో గుంటూరు, నెల్లూరు జిల్లాల మధ్య పోటీలో గుంటూరు జిల్లా 7-1 తేడాతో విజయం సాధించింది.

బాలికల విభాగంలో..

ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీల్లో ప్రకాశం జిల్లా 7-1 తేడాతో, శ్రీకాకుళం, అనంతపురం జిల్లాల మధ్య జరిగిన పోటీలో శ్రీకాకుళం జట్టు 4-2 తేడాతో, విజయనగరం, పశ్చిమగోదావరి జిల్లాల మధ్య జరిగిన పోటీలో విజయనగరం 2-1 తేడాతో, గుంటూరు, కర్నూలు జిల్లాల మధ్య జరిగిన పోటీలో గుంటూరు జిల్లా 8-2 తేడాతో విజయం సాధించాయి. అలాగే విశాఖపట్నం, కృష్ణ జిల్లాల మధ్య జరిగిన పోటీలో విశాఖపట్నం జిల్లా జట్టు 4-3 తేడాతో విజయం సాధించింది.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : డీఈవో

పిట్టలవానిపాలెం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యతోపాటు క్రీడారంగంలో మరింతగా రాణించాలని డీఈవో ఎన్. పురుషోత్తం అన్నారు. పిట్టలవానిపాలెం ప్రభుత్వ ఉన్నత




కబడ్డీ పోటీలు ప్రారంభిస్తున్న బాపట్ల డీఈవో పురుషోత్తం

పాఠశాల క్రీడా మైదానంలో బాపట్ల జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి షేక్ కరీముల్లా ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. 68వ స్కూల్‌గేమ్స్ కబడ్డీ 14 సంవత్సరాలలోపు గల క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు. డీఈవో పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 3శాతం క్రీడా రిజర్వేషన్లను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్‌గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రశాంత్‌బాబు, రౌండ్‌టేబుల్ వెంకటేష్, కేర్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమణమూర్తి, స్టేట్ అబ్జర్వర్ సుధాకర్, పాఠశాల హెచ్ఎం షేక్ మహబూబ్ సుభానీ, విద్యాకమిటీ చైర్మన్ డి.లక్ష్మీతిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈక్రీడలలో 13 బాలుర జట్లు గుంటూరు, విశాఖ పట్టణంపై 57.37, తూర్పుగోదావరి, ప్రకాశం జిల్లాపై 43.42, చిత్తూరు, అనంతపురం జిల్లాపై 52.46, కృష్ణా, నెల్లూరు జిల్లాపై 65.47, శ్రీకాకుళం, పశ్చిమగోదావరిజిల్లాపై 87.23తో విజయం సాధించారు. 13 బాలికల జట్లు గుంటూరు, విజయనగరంపై 39.7, అనంతపురం, కడపపై 48.13, పశ్చిమగోదావరి, నెల్లూరుపై 57.37, ప్రకాశం, కర్నూలుపై 74.29, తూర్పుగోదావరి, విశాఖపై 48.28, గుంటూరు, అనంతపురంపై 38.36 విజయం సాధించినట్లు తెలిపారు.

హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

సత్తెనపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ హైస్కూల్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి బాల బాలికల ఫుట్ బాల్



తల పడుతున్న గుంటూరు, చిత్తూరు జట్లు

పోటీలు శనివారం హోరాహోరీగా కొనసాగాయి. బాలుర విభాగం క్వార్టర్ ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టు పై 1-0 తేడాతో విజయం సాధించి సెమీ ఫైనల్‌కు చేరుకుంది. బాలికల విభాగంలో విశాఖపట్నం జట్టు పై కడప జిల్లా జట్టు 6-0 తేడాతో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. గుంటూరు జిల్లా జట్టు పై అనంతపురం జిల్లా జట్టు 4-0 తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది.

రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

- పాత డొక్కు బస్సుల స్థానంలో వినియోగం
- గుంటూరు డిపోలకు 200 బస్సులకు ప్రతిపాదన
- మంగళగిరి, విజయవాడ, రాజధానికి రాకపోకలకు
- మంగళగిరి, గుంటూరులో హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): డొక్కు బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్టీసీ యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అద్దె ప్రాతిపదికన మంగళగిరి, గుంటూరు-1, 2 డిపోలకు సంబంధించి 200 ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రతిపాదనలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఆర్టీసీలో ఒక్క కొత్త బస్సు కొన్న పాపాన పోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ పూర్వ వైభవానికి



చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే విభజిత జిల్లాకు 59 బస్సులు కేటాయించగా ఇందులో 42 సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. అంతేగాక కాలుష్య రహిత చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. మంగళగిరికి 100, గుంటూరు-1,2 డిపోలకు మరో 100 బస్సులను కేటాయించనున్నారు. ఈ బస్సులు అందుబాటులోకి వచ్చాక మంగళగిరి బస్టాండ్ నుంచి రాజధాని అమరావతి ప్రాంతంతో పాటు విజయవాడ రూట్‌కు ట్రిప్పులు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. మంగళగిరి నుంచి విజయవాడ రైల్వేస్టేషన్, విజయవాడతో పాటు నున్న వంటి ప్రాంతాలకు కూడా సర్వీసులను నడపాలని ప్రతిపాదనలు చేస్తున్నారు. గుంటూరు - విజయవాడ రాకపోకలకు కూడా ఇవే బస్సులను వినియోగించాలని భావిస్తున్నారు. ఈ బస్సుల చార్జింగ్ స్టేషన్ల కోసం డీపీటీవో రవికాంత్ నేతృత్వంలో పలు ప్రాంతాల్లో అన్వేషణ ప్రారంభించారు. ఆ తర్వాత గుంటూరు, మంగళగిరి కేంద్రంగా హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. మంగళగిరి డిపోతో పాటు గుంటూరు ఎన్టీఆర్ బస్టాండ్ ఆవరణలో ఉన్న విజయవాడ నాన్‌స్టాప్ బస్టాండ్ వద్ద హైస్పీడ్ చార్జింగ్ స్టేషన్‌ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. త్వరలోనే ఇది కార్యరూపం దాల్చితే పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని అధికారులు చెబుతున్నారు.

బోరుగడ్డ తీరు మరోసారి
వివాదాస్పదం

- పోలీస్‌స్టేషన్‌లోనే రిమాండ్ ఖైదీ బల్లపై నిద్ర
- ఆలస్యంగా వెలుగు చూసిన సీసీ కెమెరా ఫుటేజ్
- రాచమర్యాదలపై ఖండించిన ఎస్పీ సతీష్ కుమార్

గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనీల్ పోలీస్ కస్టడీ వ్యవహారం మరోసారి వివాదాస్పదంగా మారింది. ఇటీవల గన్నవరంలో ఓ హోటల్ ఘటన మరువక ముందే గుంటూరులోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో బోరుగడ్డ విషయంలో పోలీసుల తీరు మళ్లీ వివాదాస్పదమైంది. ఏఈఎల్సీ చర్చి కోశాధికారి కర్లపూడి బాబుప్రకాష్‌ను కత్తితో బెదిరించి రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో నిందితుడిగా రిమాండ్‌లో ఉన్న బోరుగడ్డ అనిల్‌ను ఇటీవల అరండల్‌పేట పోలీసులు కస్టడీకి తీసుకున్న విచారించారు. ఈ క్రమంలో రాత్రికి స్టేషన్‌లోనే అనిల్ కుమార్ బసచేశారు. ఆ సమయంలో ఆయనకు పోలీస్‌స్టేషన్లోని టేబుల్‌పై బెడ్ షీట్లు పరుచుకుని, దిండు వేసుకుని నిద్రించే అవకాశం కల్పించడం, అదే సమయంలో ప్రైవేటు వ్యక్తి వచ్చి ఆయనతో ముచ్చటించే వెసులుబాటు కల్పించడం వంటి అంశాలు తీవ్ర దుమారం రేపాయి. ఇప్పటికే బోరుగడ్డ విషయంలో పోలీస్ శాఖపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో తాజాగా వెలుగు చూసిన ఈ వ్యవహా రం అగ్గికి ఆజ్యం పోసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునే విధంగా వికృత రూపంలో ప్రతిపక్ష పార్టీల నాయకులను, వారి కుటుంబ సభ్యులను, మహిళలను, చిన్నపిల్లలను సైతం అసభ్యకరంగా దూషిస్తూ, బెదిరిస్తూ రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కుమార్ విషయంలో పోలీసులు ఎందుకు ఇంత ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది.

కోర్టు ఉత్తర్వులతోనే అవకాశం కల్పించాం : ఎస్పీ

విచారణలో ఉన్న ఖైదీ బోరుగడ్డకు పోలీసులు రాచమర్యాదలు చేస్తున్నారని కొందరు చేస్తున్న



ప్రచారం వాస్తవం కాదని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనిల్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో పోలీసులు తనను కొట్టారని చెప్పడంతో కనీస సదుపాయాలు కల్పించాలని మెజిస్ట్రేట్ ఆదేశాలు జారీ చేశారన్నారు. వైద్య పరీక్షల్లో గ్యాస్ట్రిక్ సమస్య ఉన్నట్లు వైద్యులు చెప్పడంతోనే బల్లపై పడుకునే అవకాశం ఇచ్చామన్నారు. అంతేగాని ఆయనకు ప్రత్యేకంగా రాచమర్యాదలు ఏమీ చేయలేదన్నారు. స్టేషన్ నుంచి సీసీ కెమెరా ఫుటేజ్ ఎలా బయటకు వచ్చిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. బోరుగడ్డను ఎస్కార్ట్ పోలీసులు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తీసుకు వెళుతున్న సమయంలో గన్నవరంలో ఓ రెస్టారెంట్‌కు తీసుకెళ్లిన సందర్భంలో జరిగిన పరిణామాలపై ఏడుగురు పోలీసులను సస్పెండ్ చేశామని తెలిపారు. శాఖాపరమైన దర్యాప్తు తర్వాత వారిపై మరిన్ని చర్యలు ఉంటాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బోరుగడ్డపై అనేక పోలీస్ స్టేషన్లో కేసు ఉన్నప్పటికీ ముందుగా ఆయనను అరెస్ట్ చేసింది తామేననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్ 2020లో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్నా అప్పట్లో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తాను వచ్చిన తర్వాత ఆ కేసును బయటకు తీసి చర్యలు తీసుకున్నామని చెప్పారు. శాఖ పరంగా తాము ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. సమావేశంలో ఏఎస్పీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అరండల్‌పేట సీఐపై వేటు

బోరుగడ్డ వ్యవహారంలో మరో పోలీసు అధికారి బలయ్యారు. స్టేషన్‌లో రాత్రివేళ ఆయనకు రాచ మర్యాదలు చేశారంటూ అందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయా ఆరోపణల నేపథ్యంలో అరండల్‌పేట సీఐ కే శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ శనివారం రాత్రి రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ఠత్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. బోరుగడ్డ వ్యవహారంలో పోలీస్ శాఖలో వరుసగా జరుగుతున్న ఘటనలు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి.

మండలి ఎన్నికల్లో..
ముందే కాడి పడేసిన వైసీపీ

- ఘోర ఓటమి తప్పదని కుంటిసాకులు
- గతంలో ఎన్నడూ గెలిచిన దాఖలాలు లేవు
- జనరల్ ఎన్నికల్లో వైసీపీ ఓటమికి విద్యావంతులే కారణం
- మళ్లీ అదే పరిస్థితులు ఎదురవుతాయని బరి నుంచి తప్పుకున్న వైనం
- కూటమి అభ్యర్థి ఆలపాటి, సిట్టింగ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు మధ్యనే ఈ సారి పోటీ



గుంటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలి ఎన్నికలకు సమాయత్తమవుతూ ఓటర్ల చేర్పులకు శిబిరాల నిర్వహణ, మేధావులతో, పార్టీ శ్రేణులతో ఎక్కడికక్కడ సమావేశాలో టీడీపీ నేతలు, అభ్యర్థి ఉండగా.. అందుకు భిన్నమైన స్థితిలో వైసీపీ ఉంది. గతానుభవాల దృష్ట్యా ఘోర ఓటమి తప్పదని ముందే గ్రహించి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఎన్నికకు ముందే వైసీపీ కాడి కింద పడేసింది. రాష్ట్రంలో ఎన్నికలు సజావుగా జరిగే పరిస్థితి లేదంటూ తాము ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. దీంతో మరో నాలుగు నెలల్లో జరగనున్న ఎన్నికలో పోటీ టీడీపీ బలపరిచిన అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ మద్దతుతో తిరిగి బరిలోకి దిగనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మధ్యనే జరగనుంది. ఈ ఎన్నికల్లో తప్పక వైసీపీ పోటీ చేస్తుందని ముందుగానే ఆ పార్టీ పెద్దలు విజయవాడకు చెందిన గౌతంరెడ్డి పేరుని ప్రకటించి ఓటరు నమోదు ప్రచార కార్యక్రమాలను కూడా నిర్వహించి ఇప్పుడు ముఖం చాటేయడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్ర నిరాశకు గురౌతున్నాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత గుంటూరు, కృష్ణా జిల్లాల్లో లక్షల మంది పట్టభద్రులు పాల్గొనబోయే ఎన్నిక వచ్చే మార్చిలో జరగనుంది. దాదాపుగా 3 లక్షల మందికి పైగా పట్టభద్రులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నియోజకవర్గం పునరుద్ధరణ జరిగినప్పటి నుంచి తొలుత చిగురుపాటి వరప్రసాద్, ఆ తర్వాత వరుసగా బొడ్డు నాగేశ్వరరావు, కేఎస్ లక్ష్మణరావు గెలుపొందారు. వైసీపీ ఏర్పడిన తర్వాత రెండు సార్లు ఈ నియోజకవర్గానికి ఎన్నిక జరిగింది. ఆ పార్టీ అండ తమకుందని చెప్పుకుని బరిలోకి దిగిన వారు ఎప్పుడూ గెలవలేదు. కాగా గత సార్వత్రిక ఎన్నికల్లో తమకు 40 శాతం ఓటు షేర్ వచ్చిందని, ఈ ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం పరిపాలనలో విఫలమైందని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి తామే భారీ మెజార్టీతో గెలుస్తామని వైసీపీ నేతలు గత కొన్ని రోజుల నుంచి ఊదరగొడుతున్నారు. అలాంటప్పుడు ప్రజల్లో వారి బలమెంతో నిరూపించుకొనే చక్కటి అవకాశం కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక రూపంలో వచ్చింది. ఎన్నికల బరిలో నిలిచి తమ బలమేంటో చూపెట్టాల్సింది పోయి ముందుగానే ఓటమి ఖాయమని తెలిసి పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించింది. అందుకు కుంటిసాకులు చెప్పకనే చెప్పింది. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో నిరుద్యోగులను గాలికొదిలేసింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం లేకుండా చేసింది. దీంతో ఉపాధి, ఉద్యోగాలు లేక పట్టభద్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. వాళ్లంతా మళ్లీ తమని ఘోరంగా ఓడిస్తారని గ్రహించిన వైసీపీ నేతలు పరువు పోగొట్టుకోవడం ఖాయమని భావించే ఎన్నికల నుంచి తప్పుకున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.



న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశనను సత్కరిస్తున్న బీజేపీ నేతలు

న్యూజిలాండ్‌లో ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

● పలు అంశాలపై అధ్యయనం ● అక్కడి బీజేపీ నేతల సన్మానం

పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మలు పలు అంశాలపై అధ్యయనం చేశారు. ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆహ్వానం మేరకు వెళ్లిన ఎమ్మెల్యేలు తెలుగేదేశం పార్టీ విజయోత్సవాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను న్యూజిలాండ్‌లో ఉంటున్న తెలుగువాసులకు వివరించారు. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్‌తో భేటీ అయ్యారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి పారిశ్రామిక విధానాలను వివరించారు. అదేవిధంగా అక్కడి విద్యుత్ శాఖ మంత్రి సిమియన్ బ్రౌన్‌తో ప్రత్యేక భేటీ అయ్యారు. అక్కడి విద్యుత్ విధానాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు బీజేపీ న్యూజిలాండ్ నేతలు సోహెన్ మిట్టల్, శేఖర్ అగర్వాల్‌లు శాలువాలతో ఇరువురు ఎమ్మెల్యేలను సత్కరించారు. ఈకార్యక్రమంలో న్యూజిలాండ్ నేషనల్ పార్టీ ప్రతి నిధులు శివ కిలారీ, బాలవేణుగోపాల్, టీడీపీ న్యూజిలాండ్ కోఆర్డినేటర్ నిమ్మగడ్డ జితేంద్ర, నేతలు మద్దుకూరి దిలీప్, సోమేపల్లి పమ్మి, గోరంట్ల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ వాయిదా అన్యాయం

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ వాయిదా వేయడం అన్యాయమని అలాగే వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని పలువురు పలువురు మాల సంఘాల నాయకులు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ 9 మంది న్యాయమూర్తులు బెంచ్ తీర్పును ప్రకటిస్తే ఆరుగురు న్యాయమూర్తులు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ క్రిమిలేయర్ తీర్పును వెలుగులోకి తీసుకురావడం అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహాసభ వ్యవస్థాపకులు మల్లెల వెంకటరావు, చప్పిడి వెంగళరావు, మాచవరపు జూలియన్, ప్రకాష్, రవి, శరత్, మంగరాజు, రాజేష్, కొండలరావు పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన నేతలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెలమవారిపాలెం పంచాయతీ పరిధిలోని చిన జమ్మలమడకలో ఇటీవల వైసీపీ కార్యకర్త చింతల శ్రీను పురుగు మందుతాగి ఆత్మహత్య చేసుకొన్నాడు. శనివారం ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, అద్దంకి పార్టీ ఇన్‌చార్జి పానెం హనిమిరెడ్డి, కొమ్మూరి కనకరావు తదితరులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు.

దుకాణంలో గ్యాస్‌లీకై చెలరేగిన మంటలు



ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లో కాలిపోతున్న దుకాణం

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఈసంఘటన శనివారం రాత్రి చీరాల మండలం ఈపూరుపాలెం మార్కెట్ సెంటర్‌లోని ఆకుల జ్ఞానవతి దుకాణంలో చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం దుకాణ నిర్వాహకులు గ్యాస్ వెలిగిస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈక్రమంలో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది.



చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యవసాయ కూలీలు

పురుగు మందుల ఘాటుకు అపస్మారక స్థితికి కూలీలు

● స్వర్ణలో ఘటన ● హుటాహుటిన చీరాల ఏరియా వైద్యశాలకు తరలింపు ● తప్పిన ప్రమాదం

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పొలాల్లో కూలి పనులకు వచ్చి మందులు వికటించడంతో నలుగురు అపస్మారక స్థితికి చేరారు. దీంతో వారిని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే స్వర్ణ కొత్త మాలపల్లికి చెందిన నందివెలుగు స్వామియేల్, కొప్పోలు జేమ్స్, దేవరపల్లి రమేష్, మద్దిరాల దావీదు గ్రామ శివారులోని పొలాల్లోకి యూరియా,గుళికలు చల్లేందుకు వెళ్లారు. ఈక్రమంలోనే సుమారు 12 బస్తాలకు పదార్థాలు కలుపుకున్నారు. 6 బస్తాలకు పైగా చల్లారు. మధ్యలో కొద్దిసేపు టిఫిన్‌చేసి విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం తిరిగి పనులు మొదలు పెట్టగా ఒక్కొక్కరుగా స్పృహ కోల్పోతున్నారు. ఈనేపథ్యంలో అందరూ వాంతులు కూడా చేసుకున్నారు. విషయం గ్రహించిన స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన నలుగురిని 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

మార్ట్‌లో చోరీ

● సరుకుతో ఐదుగురు పరార్ ● ఇద్దరిని పట్టుకున్న నిర్వాహకులు

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ మార్ట్‌లో చోరీకి యత్నించిన ఇరువురు మహిళలను వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏడుగురు మహిళలు ముందుగా మార్ట్‌లోకి ప్రవేశించి పలు వస్తువులను అపహరించి బయటకు వెళ్లిపోయారు. మరో ఇద్దరు చోరీకు పాల్పడి బయటకు వెళుతుండగా మార్ట్ నిర్వాహకులు గ్రహించి పట్టుకున్నారు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

24న కమ్మ వారి కార్తీక వన సమారాధన

ఒంగోలు (కల్చరల్), నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కమ్మవారి సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం ఈ నెల 24న జరుగుతుందని అధ్యక్షులు మండవ మురళీకృష్ణ తెలిపారు. సంఘ సమావేశం శనివారం స్థానిక నిర్మల్‌నగర్‌లోని కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకట్రాజుపాలెం వద్ద హైవే సిటీ ఆవరణలో వన భోజన మహోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

నైట్‌షెల్టర్లు.. నామమాత్రమే

5వ పేజీతరువాయి...

స్నానం తదితరాలు లేక, దుస్తులు శుభ్రం చేసుకునే పరిస్థితి లేక మురికిగా కాలం వెళ్లదీస్తుంటారు.

● గుంటూరులోని అరండల్‌పేట, ఆర్టీసీ బస్టాండ్ ఎదుట, పట్టాభిపురంలో మూడు ప్రాంతాల్లో నైట్‌షెల్టర్లు ఉన్నాయి. అయితే నిర్వహణ సక్రమంగా లేక ఇవన్నీ అపరిశుభ్రతతో అధ్వానంగా ఉన్నాయి. ఒక్కొక్క సెంటర్‌ను ఒక్కో స్వచ్ఛంద సంస్థకు అప్పగించినా వాటిని నిర్వహించలేక బాధ్యతల నుంచి ఆయా సంస్థలు వైదొలిగాయి. గత ఐదేళ్ల ఈ కేంద్రాల గురించి ప్రభుత్వం పట్టించుకోలేదు. రాత్రి వేళల్లో ఆశ్రయం కోసం వచ్చే నిరాశ్రయులకు కనీస సౌకర్యాలు ఇక్కడ ఉండటంలేదు. ఉండటానికి పెద్ద పెద్ద గదులున్నా సరైన బెడ్స్, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం లేదు. దీంతో ఇక్కడకు వచ్చేందుకు నిరాశ్రయులు, అభాగ్యులు ఆసక్తి చూపడంలేదు. అరండల్‌పేట ఒకటో లైన్‌లోని నైట్‌షెల్టర్ పరిసరాలు తీవ్రమైన దుర్వాసనతో నిండి ఉంది. కొన్ని రోజులుగా ఈ సెంటర్ తాళాలు కూడా తీయడంలేదని సమాచారం. బస్టాండ్ వద్ద ఉన్న కేంద్రానికి విద్యుత్ సరఫరా లేక అరకొర వచ్చే వారు కూడా దోమల బాధ తట్టుకోలేక వెళ్తున్నారు. పట్టాభిపురంలోని సెంటర్లో అయితే ఇద్దరు ముగ్గురు కూడా లేరు. దీంతో జీజీహెచ్ వద్ద అయితే రాత్రిళ్లే కాక పగలు కూడా వందల సంఖ్యలో ఉంటుంటారు. ఎవరైనా ఆహారం తెచ్చి పెడితే తిని అక్కడే ఎండకు, వానకు, చలికి అల్లాడుతుంటారు.

● తెనాలిలో బాలాజీరావుపేటలో గతంలో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్ వైసీపీ హయాంలో మూతపడింది. నందులపేటలోని నైట్‌షెల్టర్‌లో సుమారు 40 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఈ కేంద్రాల గురించి తెలియక పెద్దసంఖ్యలో అభాగ్యులు రోడ్లపై ఆశ్రయం పొందుతున్నారు.

● పొన్నూరులో దశాబ్దాలుగా నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో బిచ్చగాళ్లు, ఏ ఆశ్రయం లేని వారు పట్టణ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంలపై జీవనం సాగిస్తున్నారు. ఓవర్‌బ్రిడ్జి, రైల్వేప్లాట్‌ఫాంలపై 35 మంది వరకు రాత్రి వేళ సేదతీరుతున్నారు.

● నరసరావుపేటలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించే నిరాశ్రయుల వసతి గృహాల నిర్వహణకు నిధుల కొరత నెలకొంది. గుంటూరురోడ్డులోని వసతిగృహాన్ని మూసేశారు. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న మరో వసతి గృహంలో 25 మంది మహిళలు ఉంటున్నారు. అయితే ఆరు నెలలుగా నిధులు విడుదల కాలేదని నిర్వాహకులు తెలిపారు.

● పిడుగురాళ్లలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారి పక్కనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ కొన్నేళ్లుగా ఉంది. ఇక్కడ సౌకర్యాలు అరకొరగానే ఉన్నాయి. అయితే అక్కడ ఉండేవారికన్నా రోడ్ల మార్జిన్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉండే అభాగ్యులే అధికం.

● వినుకొండలో ఐదేళ్లుగా నిరాశ్రయులకు వసతిగృహం కొనసాగుతుంది. దాతల సాయంతో దుప్పట్లు పంపిణీ చేశారు. అయితే ఇక్కడ అందరికీ కాకుండా కొందరికే ఆశ్రయం కల్పిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. 30 మందికి అవకాశం ఉన్నా కేవలం 14 మందికి మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ వివరణ కొరగా ఆశ్రమానికి మున్సిపాలిటికి ఎటువంటి సంబంధంలేదన్నారు.

● చిలకలూరిపేటలో ప్రస్తుతం ఎటువంటి నైట్‌షెల్టర్లు లేవు. కొన్నేళ్ల క్రితం ఏఎంజీ సంస్థ కుమ్మరికాలనీలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. అయితే దీనిని ఉపయోగించుకునే వారు లేకపోవడంతో మూసివేశారు.

● మాచర్లలోని రామాటాకీస్‌లైన్‌లో స్వశక్తి రూరల్ యూత్ సొసైటీ ఆధ్వర్యంలో నైట్‌షెల్టర్ ఉంది. అయితే దీని గురించి నిరాశ్రయులకు సమాచారం లేదు. ఇక్కడ ఐదుగురికే ఆశ్రయం పొందే అవకాశం ఉంది.

● బాపట్లలోని రైలుపేటలో మెప్మా పర్యవేక్షణలో ఐదేళ్లుగా ఉన్న నైట్‌షెల్టర్‌లో 15 మంది ఉండటానికి అవకాశం ఉంది. అయితే 15 మందికి ఒకే మరుగుదొడ్డితో ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ మరో మూడు మరుగుదొడ్లు నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు అర్జీలు కూడా అందజేశారు. నిర్వాహకులకు ఏడాది నుంచి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారు.

● రేపల్లెలోని ఐదో వార్డులోని నైట్‌షెల్టర్‌లో నామమాత్రపు వసతులు ఉండటంతో బసకు ఎక్కువ మంది రావడంలేదు. గతంలో 40 మందిపైనే ఉండేవారు, ఇప్పుడు 16 మంది మాత్రమే ఉంటున్నారు. దాతల సహకారంతో భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, సరిపడా మరుగుదొడ్లు లేవు. ఈ సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవని నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.

గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు

బల్లికురవ మండలానికి

రూ. 3.90 కోట్ల నిధుల మంజూరు

కూటమి ప్రభుత్వం రాగానే శరగవేగంగా పనులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామాలలో అంతర్గత రోడ్లు మురికి కాలువలను అభివృద్ధి పరిచేందుకు బల్లికురవ మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ. 3.90 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో గ్రామాలలో వారం రోజుల నుంచి సిమెంట్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్లను నాణ్యత ప్రమాణాల మేర ఏర్పాటు చేయాలని, లేకుంటే క్వాలిటీ కంట్రోల్ అధికారులు చర్యలు తీసుకుంటారని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది.



పూర్తి అయిన రోడ్డును పరిశీలిస్తున్న ఏఈ



కోటవారిపాలెంలో మురుగు కాలువల పనులను పరిశీలిస్తున్న ఏఈ మాధవ్

దీంతో గ్రామాలలో రోడ్ల పనులను అధికారులు దగ్గర ఉండి కట్టుదిట్టంగా చేయిస్తున్నారు. మండలంలోని చెన్నుపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో అగ్రామ టీడీపీ నేత గొట్టిపాటి శంకర్ 235 మీటర్ల మేర సిమెంట్ రోడ్డును బీసీ కాలనీలో నూతనంగా వేయించారు. అదే గ్రామంలో మరో పది లక్షలతో ఎస్సీ కాలనీలో మరో నేత యాగంటి సింగరయ్య సిమెంట్ రోడ్ల పనులను ప్రారంభించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో రూ. 20 లక్షలతో సిమెంట్ రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. ఉప్పుమాగులూరు పంచాయతీ పరిధిలోని కోట వారిపాలెంలో రూ. 10 లక్షలతో ఆ గ్రామ టీడీపీ నేత వడ్లమూడి అరవింద్ మురుగు కాలువల నిర్మాణ పనులను చేయించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే గ్రామాలలో రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంగా చేస్తుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు శ్రీనివాసరావు ఎంపిక



అద్దంకిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు అవార్డులను ప్రకటించింది. ఈ క్రమంలో బాపట్ల జిల్లా అద్దంకి మండలంలోని చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న కేవీ శ్రీనివాసరావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక అయ్యారు. ఈ నెల 11వ తేదీన విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డులను ఉపాధ్యాయులకు అందజేయనున్నారు. కేవీ శ్రీనివాసరావు 1996 నవంబరులో తిమ్మాయపాలెం యూపీ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా చేరి, యూపీ, జడ్పీహెచ్‌ఎస్‌గా అప్‌గ్రేడ్ అయిన తరువాత 12 సంవత్సరాల 8 నెలల పాటు పని చేసి పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనంతరం కాకానిపాలెం జడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేసి ఆ పాఠశాల అభివృద్ధికి కృషి చేశారు. తరువాత 2016 నవంబరులో తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా 2023 జూన్ వరకు పనిచేసి తోటి ఉపాధ్యాయుల సహకారంతో పాఠశాల విద్యార్థుల సంఖ్యను 1023కు పెంచారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధనకు కృషి చేసి పాఠశాల పేరును చర్చించుకునేలా చేశారు. అనేక మంది విద్యార్థులకు ట్రిబుల్ ఐటీ సీట్లు, జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి బహుమతుల సాధనకు కృషి చేశారు. ప్రస్తుతం చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. విద్యార్థుల శ్రేయస్సే ధ్యేయంగా పని చేస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శ్రీనివాసరావును పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు యూటీఎఫ్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

గెలాక్సీ గ్రానైట్ గనుల్లో ముగిసిన భద్రతా వారోత్సవాలు

చీమకుర్తి, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :గెలాక్సీ గ్రానైట్ గనుల్లో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న భద్రతా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా రామతీర్థం పరిసర ప్రాంతాల్లోని 31 క్వారీల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందాలచే తనిఖీలు నిర్వహించారు. అంతకు ముందు దాదాపు వారం రోజులపాటు ట్రేడ్ పరీక్షలను క్వారీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న వారికి నిర్వహించారు. ఆయా పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానోత్సవం, ముగింపు సభను ఈనెల 17వతేదీ సాయంత్రం ఒంగోలులోని ఏ1 ఫంక్షన్‌హాలులో నిర్వహించనున్నారు. కాగా చివరిరోజు గోల్డెన్ గ్రానైట్ క్వారీలో తనిఖీ బృందాలు పరిశీలించారు. వీరికి మేనేజర్ ఎ.గిరి ఘనస్వాగతం పలికారు. అనంతరం టీంలీడర్ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రికార్డులను పరిశీలించారు.

హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ హేమలత



చీరాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా చీరాలకు చెందిన టీడీపీ నాయకురాలు డాక్టర్ సజ్జా హేమలత నియమితులయ్యారు. శనివారం కూటమి ప్రభుత్వం రెండో విడత విడుదల చేసిన నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో ఆమెకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నేతన్నల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు.

19 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బింగినపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను ఎక్సైజ్ సీఐ మేడికొండ శివకుమారి శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద 19 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

ఏపీ మాల వెల్ఫేర్ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా...

పెద్దపూడి విజయ్ కుమార్



పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో పర్చూరు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్‌కు రాష్ట్ర స్థాయిలో పదవి దక్కింది. ఆయనను కూటమిలో భాగస్వామ్యమైన జనసేన పార్టీ తరుపున ఆంధ్రప్రదేశ్ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన పెద్దపూడి విజయ్‌కుమార్ హైదారాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో రాజనీతి శాస్త్రంలో పీహెచ్‌డీ పొందారు. విద్యార్థి దశలో స్టూడెంట్స్ ఆర్గనైజేషన్‌లో పనిచేశారు. 2018 నుంచి జనసేన పార్టీలో ఉండి క్రియాశీలక నాయకునిగా తనదైన శైలిలో ముందుకు సాగుతూ ఆపార్టీ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తున్నారు. రాజనీతి శాస్త్ర విభాగం నుంచి సంక్షేమ రాజ్యం, దళితుల విద్య - ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పాత్ర అనే అశంపై పరిశోధన చేసి డాక్టరేట్ సాధించారు. ఉన్నత విద్యతోపాటు, రాజకీయ రంగంలో సానుకూల దృక్పథంతో ప్రజాదరణ పొందుతూ ముందుకు సాగుతున్నారు.



మణికేశ్వరం మల్లేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో కోటి సోమవారం పూజలు

అద్దంకి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో అతి పవిత్రంగా భావించే రోజులలో ఒకటైన కోటి సోమవారం పూజలను శనివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మణికేశ్వరం దేవాలయానికి వెళ్లిన భక్తులు గుండ్లకమ్మ నదిలో స్నానాలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. వేకువజామునుంచే భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. పలువురు భక్తులు శివదీక్ష తీసుకున్నారు. ఈవో వాసుబాబు, ప్రధాన పూజారి నడింపల్లి లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు. అద్దంకి పట్టణంలోని పాతశివాలయం, వేయిస్తంభాల గుడి, కమఠేశ్వరాలయం తదితర శివాలయాలలో కోటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు

ఇంకొల్లు : మండలంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. కోటిసోమవారాల సందర్భంగా మహిళలు వేకువజామున స్నానాలు ఆచరించి శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. 365 ఒత్తుల దీపారాధన చేశారు.ఇంకొల్లులోని శివాలయానికి శనివారం వేకువజాము నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలి వెళ్లి పూజలు ఆచరించారు. మండలంలోని చింతలపాలెంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

చట్టాలపై అవగాహన పొందాలి

● న్యాయాధికారి సుధ

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువతీ యువకులు చట్టాలపై అవగాహన పొంది బాధ్యతాయుతమైన పౌరులుగా రాణించాలని చీరాల మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ న్యాయాధికారి సుధ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వైపే ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయాధికారి ఫోక్సో వివిధ రకాల చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై కమలాకర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ నీలాకుమారి, న్యాయవాదులు రమేష్‌బాబు, రామకృష్ణారెడ్డి, ఈశ్వరి, రాజేశ్వరి, రత్నపాప, పీఎల్‌వీలు మథీన్, కృష్ణ, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మహిళను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నాకు న్యాయం జరగదు... చనిపోనివ్వండి..

● బోరున విలపించిన వివాహిత

● పట్టణంలో ఆందోళన ● పోలీసుల కౌన్సెలింగ్

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ' కట్టుకున్న భర్త నిలువున మోసం చేశాడు. చిత్ర హింసలకు గురి చేసి నడిరోడ్డుపై వదిలేశాడు. స్టేషన్‌కు వస్తే న్యాయం జరగడం లేదు. నన్ను చచ్చిపోనివ్వండి' అంటూ ఓ వివాహిత రోదించింది. ఈఘటన చీరాల పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం సుమారు మూడేళ్ల క్రితం వేటపాలెం మండలం ఆమోదగిరిపట్నంకు చెందిన తిరుపతయ్యతో చిన్నం హారికకు ప్రేమ వివాహం జరిగింది. ప్రస్తుతం వీరికి ఏడాది పాప. భర్త గతకొంత కాలంగా వేధిస్తుండటంతో వేటపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా తల్లి వద్ద జాండ్రపేటలో ఉంటుండగా తిరిగి మళ్లీ వేధిస్తున్నట్లు భర్తపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ప్రస్తుతం ఇక్కడ విచారణ జరుగుతోంది. అయితే ఆమె తనకు న్యాయం జరగడం లేదంటూ పట్టణంలో ఆందోళనకు దిగింది. తిరిగి పోలీసులు మళ్లీ వన్‌టౌన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. నాకు న్యాయం జరగదని.. చచ్చిపోయేందుకు అనుమతివ్వాలని రోదించింది. పోలీసులు నచ్చచెప్పి తల్లితో పంపించారు.

గేదె కళేబరాన్ని ఢీకొట్టి కారు బోల్తా

మహిళ మృతి



బోల్తా పడిన ఇన్నోవా కారు

టంగుటూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై పడి ఉన్న గేదె కళేబరాన్ని కారు ఢీకొని బోల్తా పడటంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన సూరారెడ్డిపాలెం- నాయుడుపాలెం మధ్య శుక్రవారం రాత్రి పొద్దుపోయాక చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుపతి బయల్దేరింది. అందులో 8 మంది ప్రయాణిస్తున్నారు. వీరి కారు సూరారెడ్డిపాలెం- నాయుడుపాలెం మధ్య అప్పటికే గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెంది ఉన్న గేదెను ఢీకొని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒరుసు పార్వతి (50) అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎస్సై నాగమల్లేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన పార్వతి

అవీ..ఇవీ



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగ వెంకటలక్ష్మి

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సీనియర్ సివిల్ న్యాయాధికారిణి నాగవెంకటలక్ష్మి

అద్దంకి, నవంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ న్యాయాధికారిణి, మండల న్యాయసేవాధికారసంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి అన్నారు. అద్దంకి పట్టణంలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో శనివారం జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నాగవెంకటలక్ష్మి మట్లాడుతూ అర్హులైన వారు ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యరమోతు రమేష్ బాబు, న్యాయవాదులు పీఎల్ఎన్ ప్రసాద్, టి.మార్త శ్రీనివాస్, ఎం ప్రకాష్, షేక్ మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



మూలవిరాట్‌ని అభిషేకిస్తున్న సూర్యకిరణాలు

లక్ష్మీచెన్నకేశవునికి సూర్యకిరణాభిషేకం

సంతరావూరు(చినగంజాం), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామ లక్ష్మీ చెన్నకేశ్వరస్వామి దేవస్థానంలోని మూల విరాట్‌ని శనివారం సూర్యోదయ వేళ కొన్ని నిమిషాల పాటు భానుని లేలేత కిరణాలు తాకాయి. ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో కోటి సోమవారం నుంచి పౌర్ణమిలోపు, మాఘమాసంలో స్వామి వారిని సూర్యోదయాన భానుడి లేలేత కిరణాలు లక్ష్మీచెన్నకేశ్వరస్వామి మూల విరాట్‌ను అభిషేకిస్తాయని దేవదాయ శాఖ ఈవో పోతిన శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 7.05 గంటల వరకు దేవస్థానంలో స్వామి వారిని భానుని కిరణాలు అభిషేకించే దృశ్యాన్ని భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి దిట్టకవి కృష్ణామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



ఆధారాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ, సీఐ శేషగిరిరావు

వివాదాలతో సమస్యలను కొనితెచ్చుకోవద్దు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు వివాదాలతో సమస్యలు కొనితెచ్చుకోవద్దని, సామరస్యంగా సాగు చేసుకోవాలని చీరాల తహసీల్దార్ గోపీకృష్ణ, రూరల్ సీఐ శేషగిరిరావు పేర్కొన్నారు. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలోని వాద పొలాల్లో సాగునీరు విషయమై గతకొంత కాలంగా కొండారెడ్డి అనీల్ మరికొందరు రైతులకు మధ్య వివాదం నడుస్తోంది. ఈక్రమంలో ఓవర్గంలోని రైతులు కలెక్టర్ వెంకట మురళీకి ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన రెవెన్యూ, పోలీసులు రెండు వర్గాలకు నచ్చజెప్పి సాగునీటిను విడుదల చేశారు. అనంతరం ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు కార్యాలయానికి పిలిపించి సమస్యను పరిష్కరించారు. దీంతో ఒకింత సానుకూల వాతావరణం నెలకొంది. ఎస్సై చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరికీ ఓటుహక్కు కల్పించాలని తహసీల్దార్ జి.ప్రభాకరరావు బీఎల్వోలకు సూచించారు. మండలంలోని కడవకుదురు, చినగంజాం, రాజుబంగారుపాలెం,మున్నంవారిపాలెం గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు శిబిరాలను శనివారం ఆయన పరిశీలించారు. బీఎల్వోలకు పలు సూచనలు అందజేశారు. శని, ఆది వారాల్లో నూతన ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. తప్పులు లేకుండా మంచి ఓటర్ల జాబితాను తయారు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గొట్టిపాటి జన్మదిన వేడుకలు

ఉత్సాహంగా నిర్వహించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

ప్రజల వెంటే మా కుటుంబం : బాబి

అద్దంకి, నవంబరు9: విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో వలే ఈ ఏడాది కూడా తన పుట్టిన రోజు వేడుకలకు దూరంగా, నిరాడంబరంగా హైదరాబాద్‌లో కుటుంబసభ్యులతో ఉన్నారు. అయితే నియోజకవర్గం మొత్తం టీడీపీ నేతలు, కార్యకర్తలు, గొట్టిపాటి అభిమానులు శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అద్దంకి మండల టీడీపీ నేతల ఆధ్వర్యంలో అద్దంకి పట్టణంలోని ఒంగోలు రోడ్డులోని సూర్య రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మంత్రి రవికుమార్ సోదరుని కుమారుడు కమల్‌కిషోర్(బాబి), పలువురు టీడీపీ నేతలతో కలిసి కట్ చేశారు. ఈ సందర్భంగా బాబి మాట్లాడుతూ గొట్టిపాటి కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలతోనే ఉంటూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన భిక్షకు అయ్యప్ప, శివ, హనుమాన్, భవానీ, వేంటేశ్వర స్వామి దీక్షలు తీసుకున్న భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, మానం మురళీమోహన్‌దాస్, కఠారి నాగేశ్వరరావు, చాగంటి రాజేంద్ర ప్రసాద్, బండారు రాఘవ, దత్, తదితరులు పాల్గొన్నారు.



అద్దంకి రూరల్ మండల నేతల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేస్తున్న గొట్టిపాటి కమల్‌కిషోర్(బాబి), టీడీపీ నేతలు



గొట్టిపాటి రవికుమార్ జన్మదినం కేక్‌ను కట్ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ అద్దంకి పట్టణ నేతలు

మున్సిపల్ కార్మికులకు దుప్పట్ల పంపిణీ

మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను అద్దంకి మున్సిపల్ కౌన్సిలర్ లు, అద్దంకి పట్టణ టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేశారు. మున్సిపల్ కార్మికులకు దామా హనుమంతరావు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు.మధ్యాహ్నం వేయిస్తంభాల గుడిలో క్లస్టర్ ఇన్‌చార్జి కాకాని అశోక్ ఆధ్వర్యంలో దీక్షా భక్తులకు సద్ది ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ శ్రీచరణ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, మేనేజర్ శ్రీదేవి, టీడీపీ నేతలు చిన్ని శ్రీనివాసరావు, కుందారపు రామారావు, కాకాని అశోక్, సందిరెడ్డి శ్రీనివాసరావు, సందిరెడ్డి రమేష్, నాదెండ్ల సుబ్బారావు, చుండూరి మురళీసుధాకర్, గుంటూరు మాధవరావు, లహరి, గుంజి శ్రీనివాసరావు, గట్టుపల్లి రామారావు, వైస్ చైర్మన్ దేసు పద్మేష్, కౌన్సిలర్ లు అత్తులూరి రమేష్, మాగులూరి తిరుపతమ్మ, కంపా రజనీ, మొండితోక సీతమ్మ, బొజ్జా వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి సుధీర్, రంగిశెట్టి సుభాషిణి,కొణిజేటి విజయలక్ష్మి, షేక్ జహీరా, అంకం తేజశ్విని, ఏజెండ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరులో ఘనంగా నిర్వహణ

పంగులూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు కె.వి.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావులు శనివారం స్థానిక నేతలతో కలసి కేక్ కట్ చేశారు. స్థానికంగా ఉన్న బాల, బాలికల వసతి గృహాలలో విద్యార్థినీ విద్యార్థులకు పండ్లు, మిఠాయిలు పంచారు. టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, అల్లంనేని బ్రహ్మానందస్వామి, చింతల సహదేవుడు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు వరపర్ల సుబ్బారావు, పూనాటి రామాంజనేయులు, గుదిబండ్ల ఆదిరెడ్డి, ఉన్నం రవిబాబు, గడ్డం నాడేశ్వరరావు, రావుల సింగరకొండ, ధూళిపాళ్ళ శ్రీనివాసరావు, పచ్చా శీను, బీసీ నాయకులు రౌతు వీరాంజనేయులు, దాసరి హనుమంతరావు, కోటయ్య పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తూర్పు తక్కెళ్లపాడులో

మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడులో రవికుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం స్థానికులకు పులిహోరతో పాటు మిఠాయిలు అందజేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి భానుప్రకాష్, ఎనికపాటి వాయునందనరావు, కూనంనేని వీరయ్య, శృంగారపు బ్రహ్మయ్య, పాలపర్తి జక్రయ్య, పూసల ప్రసాద్, షేక్ హస్సాన్‌వలి, శృంగారపు శ్రీను, పూసల కొండలు, బుల్లిబాబు, బోడాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముప్పవరంలో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండల నేతలు



సంతమాగులూరు మండలంలో కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సంతమాగులూరులో

సంతమాగులూరు, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలు శనివారం సంతమాగులూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డులోని మంత్రి అతిథి గృహంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ మండల స్థాయి నాయకులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తేలప్రోలు రమేష్, సన్నెబోయిన ఏడుకొండలు, చేవూరి వాసిరెడ్డి, నన్నెబోయని గురుబ్రహ్మం, దూపాటి ఏసోబు, దుద్దేల గాలియ్య, అట్లా పెద వెంకటరెడ్డి, గుండపునేని సురేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టీడీపీ బల్లికురవ మండల కార్యాలయంలో మంత్రి రవికుమార్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న పార్టీ నేతలు

బల్లికురవలో మిఠాయిలు పంచి అన్నదానం

మంత్రికి ఫోనులో శుభాకాంక్షలు తెలిపిన నేతలు

బల్లికురవ. నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదిన వేడుకలను శనివారం బల్లికురవ మండల కేంద్రంలో టీడీపీ నేతలు ఘనంగా నిర్వహించారు. కొందరు మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించగా మరికొందరు నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహించారు. మిఠాయిలను పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు ఫోనులో మంత్రి రవికుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలానే వైదన గ్రామంలో మంత్రి రవి కుమార్ జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో పార్టీ మండల నేతలు దూళిపాళ్ల రామగోవిందు, గొట్టిపాటి లక్ష్మయ్య, మండల పార్టీ అధ్యక్షులు కొండేటి ఇజ్రాయల్, మలినేని గోవిందరావు, గొట్టిపాటి శంకర్, దద్దాల అంజయ్య, పుచ్చకాయల వెంకట్రావు, పత్తిపాటి వెంకట్రావు, యాగంటి సింగరయ్య, ఆళ్ల చంద్రమౌళి, గుంజి సుబ్బారావు, పోగుల చంద్రశేఖర్, చింతల అమరనాద్, పందిరి అంజిబాబు, పెంట్రాల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీ యజమానుల శుభాకాంక్షలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు గ్రానైట్ క్వారీలు, ఫ్యాక్టరీలకు చెందిన యజమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కామేపల్లి గ్రానైట్ అండ్ ఎక్స్‌పోర్ట్సు యజమాని కామేపల్లి లక్ష్మీప్రసాద్, కలర్ గ్రానైట్ క్వారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దూళిపాళ్ల శ్రీకాంత్, పలు క్వారీలకు చెందిన వారు మంత్రికి ఫోనులో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలానే గాయత్రి ఎక్స్‌పోర్ట్సు యజమానులు దేవినేని శ్రీనివాసరావు, వేణుగోపాల్ సాయికృష్ణ గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని దూలిపాళ్ల వెంకట్రామయ్య, గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానుల సంఘం అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, పలు శాఖల అధికారులు మంత్రి రవికుమార్‌కు శుభాంక్షలు తెలిపారు.

మంత్రి జన్మదినం సందర్భంగా అన్నదానం

మేదరమెట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో తెలుగు దేశం పార్టీ నాయకులు అన్నదానం నిర్వహించారు. శనివారం రవికుమార్ జన్మదినం సందర్భంగా స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 500 వందల మంది అయ్యప్ప, శివ స్వాములకు అన్నదానం చేశారు. పలు గ్రామాలలో రవికుమార్ జన్మదినం సందర్భంగా కేక్‌లు కట్ చేసి తెలుగుదేశం నాయకులు వేడుకలు నిర్వహించారు.



పుట్టావారిపాలెంలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన టీడీపీ నాయకులు

పుట్టావారిపాలెంలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

సంతమాగులూరు, నవంబరు 9: (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుట్టావారిపాలెం గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లగా లోవోల్టేజి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టావారిపాలెం గ్రామ పర్యటనకు వచ్చిన సమయంలో గ్రామ ప్రజలందరూ తమ సమస్యను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో చకాచకా నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి శనివారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ పుట్టినరోజు సందర్భంగా ప్రారంభించి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచ్ నన్నెబోయిన గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పదవులకు వన్నెతేవాలి

కార్పొరేషన్ చైర్మన్‌లుగా ఎంపికైన వారిని అభినందించిన ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, నవంబరు9 (ఆంధ్రజ్యోతి): వివిధ కార్పొరేషన్ చైర్మన్ లుగా ఎంపికైన వారందరూ ప్రభుత్వం ప్రతిష్టను పెంచేవిధంగా, ప్రజల నమ్మకాన్ని చూరగొనేవిధంగా పాలన సాగిస్తూ పనిచేయాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూ రి సాంబ శివరావు ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పంచాయతీ రాజ్ శాఖా మాత్యులు నారా లోకేష్‌లు రాష్ట్ర అభివృద్ధిని కాంక్షిస్తూ కార్పొరేషన్ చైర్మన్‌లుగా నియమించిన వారిని న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు ప్రత్యేకంగా శనివారం ఫోన్‌లో అభినందించారు. వారిలో బాపట్ల అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు, ఏపీ మాల వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా డాక్టర్ పెద్దపూడి విజయ్ కుమార్ ,ఏపీ హ్యాండ్లూమ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్‌గా సజ్జా హేమలత, ఏపీ అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావులకు ఏలూరి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా టీడీపీ కూటమి ప్రభుత్వం పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజానీకానికి, పేద కుటుంబాలకు అండగా ఉండే విధంగా అందరూ కృషి చేయాలని ఆకాంక్షించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఎమ్మెల్యే ఏలూరి,సలగల రాజశేఖర్ బాబు (ఫైల్)



తిరుమలలో నటుడు నిఖిల్ , ఎమ్మెల్యే కొండయ్య కుటుంబ సభ్యులు

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య శనివారం తిరుమలలో కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకున్నారు. తన మేనల్లుడు, సినీ హీరో నిఖిల్ సిద్దార్థ్ కుమారుని పుట్టెంటుకుల చెల్లింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తిరుమల, తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్ బి.ఆర్ నాయుడును ఎమ్మెల్యే కొండయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు చినగంజాం విద్యార్థి

చినగంజాం, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామానికి చెందిన కోకి అంకుల్‌రెడ్డి 68వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ అండర్-14 కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కోచ్, అధ్యక్షులు మరుప్రోలు గిరిబాబు శనివారం తెలిపారు. ఒంగోలు డీఆర్ఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ పోటీలలో అండర్-14 కబడ్డీ పోటీలలో అంకుల్‌రెడ్డి ప్రతిభ చూపి జిల్లా కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. స్థానిక సత్యం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతూ బాలకోటేశ్వర స్పోర్ట్స్ క్లబ్‌లో కబడ్డీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన అంకుల్‌రెడ్డిని సత్యం హైస్కూల్ కరస్పాండెంట్ నున్నా హరనాథ్‌బాబు, బాలకోటేశ్వర స్పోర్ట్సు క్లబ్ కోచ్ గిరిబాబు, కార్యదర్శి బి.నాగంజనేయులురెడ్డి, ఉపాధ్యక్షులు బి.శివారెడ్డి, జాయింట్ కార్యదర్శి కె.సతీష్‌రెడ్డి, కోశాధికారి డి. సుబ్బారెడ్డి, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు సీహెచ్ మధుసూదన్‌రెడ్డి, జీటీ అంకిరెడ్డి, నంగు శ్రీనివాసరెడ్డి, కోమట్ల పవన్‌కళ్యాణ్‌రెడ్డి, నిద్ర శ్రీనివాసరెడ్డిలు అభినందనలు తెలిపారు.



కోకి అంకుల్‌రెడ్డి

నేడే పలు గ్రామాలలో విద్యుత్ కోత

మేదరమెట్ల, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేదరమెట్ల, సోమవరప్పాడు, కొరిశపాడు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సమ్మర్ రివిజన్ పరిశీలన

పంగులూరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) :ఓట్ల చేర్పులు మార్పులకు సంబంధించి పోలింగ్ బూత్‌లలో శనివారం నిర్వహించిన స్పెషల్ సమ్మర్ రివిజన్ కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ పి.సింగారావు శనివారం పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమాన్ని శని, ఆది వారాలలో బీఎల్‌వోలు నిర్వహిస్తారని తెలిపారు. మండలంలోని 222, 224 పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ సింగారావు పరిశీలించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వేటపాలెం(చీరాల), నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి, రామన్నపేట పంచాయతీల పరిధిలోని పోలింగ్ బూత్‌లను శనివారం తహసీల్దార్ పార్వతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి సందేహాలను నివృత్తి చేశారు.

ఓట్ల మార్పులు చేర్పుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు

చీరాలటౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): నూతన ఓట్లు, మార్పులు, చేర్పుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు అన్నారు. ఓటరు ప్రత్యేక డ్రైవ్ చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఆర్డీవో శనివారం చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురం, జాండ్రపేట పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈనెలలో 23, 24 తేదీలలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ గోపీకృష్ణ, బీఎల్‌వోలు సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) :ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు శనివారం ఓటర్ల స్పెషల్ డే క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరు మండల పరిధిలోని 141, 142, 143, 144, 145, 146 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ బ్రహ్మయ్య పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రేమ్ కుమార్, వీఆర్వో గోవిందరెడ్డి, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన అపుస్మా నేతలు

పర్చూరు, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : బాపట్ల జిల్లా డీఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పురుషోత్తంని అపుస్మా ప్రతినిధులు శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను డీఈవో దృష్టికి తీసుకుపోయారు. ప్రస్తుతం కొనసాగుతున్న అపార్ ఐడీ గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ అపుస్మా అధ్యక్షులు తేళ్ల వెంకట రాము, జిల్లా గౌరవ అధ్యక్షులు తోటకూర విజయ్ భాస్కర్, అపుస్మా పర్చూరు నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ సభ్యులు నాదెండ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



డీఈవో పురుషోత్తంని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న అపుస్మా ప్రతినిధులు

కార్తీక వన సమారాధన పత్రిక ఆవిష్కరణ

అద్దంకిటౌన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అద్దంకి సీమ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన ఆహ్వాన పత్రికను శనివారం రాత్రి సంఘ నాయకులు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జె. హనుమంతరావు, ఉపాధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఈదర వెంకట శివప్రసాద్, స్వర్ణ సుబ్బారావు, పోలూరు హనుమంతరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.